జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
శనివారం 5 సెప్టెంబర్ 2026
పేజీలు : 8

## నకిలీ పత్రాలతో స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నం



- నలుగురు అరెస్ట్ ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి
- స్థల యజమాని పత్రాలను దుర్వినియోగం చేసి
- నకిలీ డాక్యుమెంట్ల సృష్టి
- 8 మందిపై మావల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు
- ఒకే ప్లాటు పై మూడు రిజిస్ట్రేషన్లు అసలు యజమానిని డబ్బుల డిమాండ్

# ఉల్లిగడ్డ మంట

## సామాన్యుడి వంటింటికి కంటతడి!



**మంచిర్యాలరూరల్ సెప్టెంబర్04(ప్రజాజ్యోతి)** వంటింట్లో తప్పనిసరి సరుకుగా మారిన ఉల్లిగడ్డ ఇప్పుడు సామాన్యుడికి భారంగా మారింది.గత నెలలో కిలో రూ.40కు లభించిన ఉల్లిగడ్డ ధర ప్రస్తుతం రూ.60కు చేరడం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న వేళ ఉల్లిగడ్డ ధర కూడా ఒక్కసారిగా పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.

**--ధర పెరుగుతున్నా.. పర్యవేక్షణ ఏది?**

ఉల్లిగడ్డ ధర పెరుగుదలకు అసలు కారణం ఏమిటి? మార్కెట్లో సరఫరా తగ్గిందా?మధ్యవర్తుల పాత్ర ఉందా?లేక కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా?అన్న ప్రశ్నలు వినియోగదారుల నుంచి వినిపిస్తున్నాయి. మార్కెట్లో ఉల్లిగడ్డ ధరలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.



## వాంకిడి కేంద్రంలో ఆర్ఎంపీల వైద్యం.. నిబంధనలు గాలిలోనా?



- శిథిలావస్థలో క్లినిక్‌లు.. వైద్య సేవలపై పర్యవేక్షణ ఏది?మందుల వినియోగం, క్లినిక్‌ల నిర్వహణపై అధికారుల తనిఖీలు ఎక్కడ?
- అర్హతకు మించిన వైద్యం చేస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరపాలంటున్న ప్రజలు

## తక్కువ వర్షానికే కొట్టుకుపోయిన కుడికాలువ!

- మాణిక్‌గూడలో నాసిరకం పనులపై సీపీఎం ఆగ్రహం
- లక్షలాది ప్రజాధనం వృథా.. అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు
- కుడికాలువ పనులపై సమగ్ర విచారణ జరపాలి
- కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి శాశ్వత పరిష్కారం చూపాలి





# కార్మికుల హృదయ నేత... మనుబోతుల కొమురయ్య

## కార్మిక హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానాయకుడి స్ఫూర్తి నేటి తరానికీ ఆదర్శం

**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**సింగరేణి బొగ్గు గనుల చరిత్ర అంటే కేవలం బొగ్గు ఉత్పత్తి, పారిశ్రామిక ప్రగతి చరిత్ర మాత్రమే కాదు. ఆ నల్ల బంగారాన్ని వెలికితీసిన కార్మికుల చెమట, కన్నీరు, త్యాగాలు, పోరాటాల చరిత్ర కూడా. సింగరేణి కార్మికులకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, కుటుంబ సంక్షేమం, వారసత్వ ఉద్యోగాలు, పెన్షన్ వంటి అనేక హక్కులు సాధించడంలో పలువురు కార్మిక నాయకులు కీలక పాత్ర పోషించారు. అలాంటి మహానాయకుల్లో మనుబోతుల కొమురయ్య పేరు సింగరేణి కార్మిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు . కార్మికుల సమస్యలను తన సమస్యలుగా భావించి, యాజమాన్యంతో నిరంతరం పోరాడుతూ కార్మిక కుటుంబాల భవిష్యత్తు కోసం తన జీవితాన్నే అంకితం చేసిన కొమురయ్యను కార్మికులు ప్రేమగా "యూనియన్ కొమురయ్య" అని పిలుచుకునేవారని ఆయన తెలిపారు. ఆయన పోరాట జీవితం సింగరేణి కార్మిక ఉద్యమానికి ఒక గొప్ప అధ్యాయమని అన్నారు.

### ఇల్లందు గడ్డపై పుట్టి కార్మిక ఉద్యమంలోకి

ఉమ్మడి ఖమ్మం జిల్లా, ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు సింగరేణి బొగ్గు గనుల పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందింది. ఇదే నేలపై 1928 జూన్ 12న మనుబోతుల కొమురయ్య జన్మించారు. చిన్న వయసులోనే వామపక్ష సాహిత్యం, కరపత్రాలు చదవడం ద్వారా సమాజంలోని అసమానతలు, కార్మికుల దుస్థితిపై అవగాహన పెంచుకున్నారు. గనుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రత్యక్షంగా చూసిన కొమురయ్య, వారి తరఫున నిలబడాలని నిర్ణయించుకున్నారు. 1940లో కొత్తగూడెం మెయిన్ వర్క్‌షాప్‌లో టర్నర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, ఉద్యోగం చేస్తూనే కార్మికుల సమస్యలపై ఉద్యమాల్లో పాల్గొన్నారు. దేవూరి శేషగిరిరావు, మఖ్దూమ్ మొయినుద్దీన్, రాజ్‌బహదూర్, కె.ఎల్. మహేంద్ర వంటి ఆనాటి కార్మిక నాయకులతో కలిసి ఉద్యమాలను నిర్మించారు.

### ఏఐటీయూసీ నిర్మాణంలో కీలక పాత్ర

1942 మే 1న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) స్థాపనలో కొమురయ్య కీలక పాత్ర పోషించారు. కార్మిక హక్కుల కోసం పోరాడటంతో పాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ చురుకుగా పాల్గొన్నారు. ఈ పోరాటాల కారణంగా 1947 నుంచి 1948 వరకు జైలు జీవితం గడిపారు. జైలు జీవితం ఆయన పోరాట స్ఫూర్తిని ఏమాత్రం తగ్గించలేదు. విడుదలైన అనంతరం మరింత పట్టుదలతో కార్మిక ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. దాదాపు 44 సంవత్సరాల పాటు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి కార్మికుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచారు. ఆయనకు పదవి ఒక అలంకారం కాదని, కార్మికుల గొంతుకగా పనిచేయడానికి ఒక బాధ్యతగా భావించేవారని వేణు మాధవ్ తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల కోసం అలుపెరుగని పోరాటం చేశారు.సింగరేణి గనుల్లో కాంట్రాక్టు కార్మికుల దోపిడీని కొమురయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. శాశ్వత స్వభావం కలిగిన పనులను కాంట్రాక్టర్ల ద్వారా చేయిస్తూ కార్మికులను అస్థిరతలోకి నెట్టే విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మహిళలు, పిల్లలను భూగర్భ బొగ్గు గనుల్లో పనిచేయించడాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. యాజమాన్యంపై పోరాడి వారికి భూగర్భ పనులకు బదులుగా ఉపరితల ప్రాంతాల్లో పని కల్పించేలా చర్యలు సాధించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపైనా నిరంతరం పోరాడి అనేక మందిని పర్మినెంట్ చేయించడంలో కీలక పాత్ర పోషించారు. కార్మికుడికి పని అంటే కేవలం వేతనం కాదు.. గౌరవం, భద్రత, కుటుంబ భవిష్యత్తు కూడా అనే భావనను కొమురయ్య తన ఉద్యమం ద్వారా బలంగా చాటి చెప్పారు.

### వేజ్ బోర్డుల్లో సింగరేణి కార్మికుల గొంతుక

కొమురయ్య సింగరేణి యూనియన్ నాయకుడిగానే పరిమితం కాలేదు. జాతీయ స్థాయిలో బొగ్గు కార్మికుల సమస్యలను వినిపించిన నాయకుడిగా ఎదిగారు. రేగే కమిటీ, జాదన్ కమిటీ, మజుందార్ కమిటీ, లేబర్ అప్పిలేట్ వంటి వివిధ కార్మిక సంబంధిత కమిటీల్లో సభ్యునిగా పనిచేశారు. అనంతరం కోల్ వేజ్ కమిటీ, జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ (జెబీసీసీఐ) వంటి వేదికల్లో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను బలంగా వినిపించారు. మొదటి వేజ్ బోర్డు నుంచి ఆరవ వేజ్ బోర్డు వరకు సింగరేణి తరఫున శాశ్వత వేజ్ బోర్డు సభ్యుడిగా కొనసాగుతూ కార్మికులకు ఇంక్రిమెంట్లు, ఎల్‌టీసీ, క్యాడర్ స్కీమ్ వంటి అనేక ప్రయోజనాలు సాధించేందుకు కృషి చేశారు. 1974 రఘునాథ్‌రెడ్డి అవార్డు సందర్భంలో సింగరేణి కార్మికులకు కోల్ ఇండియా కార్మికులతో పోలిస్తే అదనపు ప్రయోజనాలు సాధించడంలో ఆయన పోరాటం కీలకంగా నిలిచింది. కోల్ ఫిల్లర్లకు మైన్ యావరేజ్, మైనింగ్ స్టాఫ్‌కు అదనపు ఇంక్రిమెంట్ వంటి ప్రయోజనాల వెనుక కూడా ఆయన పోరాట స్ఫూర్తి ఉందన్నారు.



### ఎమర్జెన్సీలోనూ కార్మికుల పక్షానే

1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయంలో కార్మిక హక్కులపై తీవ్ర ఆంక్షలు వచ్చాయి. సింగరేణిలో కూడా అనేక మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి కుటుంబాలతో సహా ఆందోళనకు గురయ్యారు. అయినా కొమురయ్య వెనుకడుగు వేయలేదు. తొలగించబడిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకురావడానికి పోరాడారు. ఆయన కృషితో అనేక మంది కార్మికులు తిరిగి ఉపాధిని పొందగలిగారు. కార్మికుడితో పాటు కుటుంబ సంక్షేమం అనే భావించారు. కొమురయ్య పోరాటంలో అత్యంత విశిష్టమైన అంశం కార్మికుడితో పాటు అతని కుటుంబ సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం. కార్మికుడు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ఆయన నిరంతరం పోరాడారు. 1981 జనవరిలో సింగరేణి యాజమాన్యంతో జరిగిన ఒప్పందం ద్వారా, అప్పటి పరిస్థితుల్లో కోల్ ఇండియాలో లేని విధంగా, కార్మికుడు పదవీ విరమణకు రెండు సంవత్సరాల ముందే స్వచ్ఛంద పదవీ విరమణ కోరితే కుటుంబంలోని ఒకరికి వారసత్వ ఉద్యోగం కల్పించే అవకాశం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. అలాగే కార్మికుడు మరణించినా, వైద్యపరంగా అనర్హుడై ఉద్యోగం కోల్పోయినా అతని పిల్లలకు తండ్రి క్వార్టర్ కొనసాగించేలా చర్యలు సాధించారు. కార్మిక కుటుంబాల పట్ల ఆయనకున్న మానవీయ దృక్పథానికి ఇది నిదర్శనమని వేణు మాధవ్ అన్నారు.

### పెన్షన్ కోసం పోరాడిన మహానుభావుడు

ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ ఉన్నప్పుడు బొగ్గు గని కార్మికులకు కూడా పెన్షన్ ఉండాలనే డిమాండ్‌ను కొమురయ్య బలంగా ముందుకు తీసుకెళ్లారు. కార్మికుల వృద్ధాప్య జీవితానికి భద్రత అవసరమని పట్టుదలగా వాదించారు. కార్మికుడు తన జీవితంలోని అత్యంత శక్తివంతమైన సంవత్సరాలను దేశ పారిశ్రామిక అభివృద్ధికి అంకితం చేసినప్పుడు, వృద్ధాప్యంలో అతనికి గౌరవప్రదమైన జీవితం కల్పించడం సమాజ బాధ్యత అనే సిద్ధాంతంతో ఆయన




పోరాటం సాగించారు. కొమురయ్య పోరాటం కేవలం బొగ్గు గనులకే పరిమితం కాలేదు. పేపర్, స్టీల్, సిమెంట్, విద్యుత్ తదితర పారిశ్రామిక రంగాల్లో యూనియన్ల నిర్మాణానికి, కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాల సాధనకు కృషి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడిగా, జాతీయ ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడిగా, ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించి జాతీయ కార్మిక నాయకుడిగా గుర్తింపు పొందారు.

### చివరి శ్వాస వరకు కార్మికుల కోసమే

1996 నాటికి ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ ఆయన కార్మిక సమస్యలకు దూరం కాలేదు. కొత్తగూడెంలో కార్మికుల కోసం నిరాహార దీక్షకు సన్నద్ధమవుతూ చివరి వరకు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించారు. 1996 సెప్టెంబర్ 5న ఆయన తుదిశ్వాస విడిచారు. మరుసటి రోజు నుంచి నిరాహార దీక్షకు కార్మికులను సిద్ధం చేసిన నాయకుడు, అదే ఉద్యమం కోసం తన జీవితాన్ని అర్పించి వెళ్లిపోవడం ఆయన అంకితభావానికి నిదర్శనమని వేణు మాధవ్ అన్నారు. కొమురయ్య వారసత్వం నేటి తరానికి మార్గదర్శకం అన్నారు .మనుబోతుల కొమురయ్య జీవితాన్ని కేవలం ఒక యూనియన్ నాయకుడి జీవిత చరిత్రగా చూడటం సరైంది కాదు. ఆయన జీవితం కార్మిక ఐక్యతకు, హక్కుల కోసం నిరంతర పోరాటానికి, కుటుంబ సంక్షేమానికి, సామాజిక న్యాయానికి మార్గదర్శకం. నేడు సింగరేణిలో శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబాలు ఉద్యోగ భద్రత, వేతనాలు, పెన్షన్, వైద్య సదుపాయాలు, వారసత్వ ఉద్యోగాలు, క్వార్టర్లు, కాంట్రాక్టు కార్మికుల హక్కులు వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఇలాంటి సమయంలో కొమురయ్యను స్మరించుకోవడం అంటే కేవలం పూలమాలలు వేయడం కాదని, ఆయన చూపిన ఐక్యత, ధైర్యం, నిబద్ధత, కార్మిక ప్రయోజనాల పట్ల అంకితభావాన్ని ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని అన్నారు. సింగరేణి బొగ్గు నల్లగా కనిపించినా, ఆ బొగ్గులో కోట్లాది కుటుంబాల జీవన వెలుగు దాగి ఉందని, ఆ వెలుగును వెలికి తీసిన కార్మికుల హక్కుల కోసం తన జీవితాన్ని అర్పించిన మనుబోతుల కొమురయ్య వంటి నాయకుల త్యాగాలను చరిత్ర ఎన్నటికీ మరచిపోదని సింగరేణి కార్మికుల హృదయాల్లో కొమురయ్య ఒక నాయకుడిగానే కాకుండా ఒక నమ్మకంగా.. ఒక పోరాట స్ఫూర్తిగా.. కార్మిక హక్కుల ప్రతీకగా చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అన్నారు

# 12వ వేజ్‌బోర్డు డిమాండ్లలో బొగ్గు పెన్షనర్లకు 50 శాతం పెన్షన్ పెంపు చేర్చాలి

## జాతీయ కార్మిక సంఘాలకు మంచిర్యాల సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్

**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**గత 25 సంవత్సరాలుగా పెంపుదలకు నోచుకోని కోల్ మైన్స్ పెన్షన్‌ను కరువు భత్యంతో కూడిన 50 శాతం పెంపుతో అమలు చేసే విధంగా 12వ వేజ్‌బోర్డు వేతన సవరణ డిమాండ్లలో పొందుపరచాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం జాతీయ కార్మిక సంఘాలను డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్, ఎల్ఐసీ కాలనీ, ఐబీ ఏరియాల్లో సింగరేణి విశ్రాంత కార్మికులతో సమావేశాలు నిర్వహించి, బొగ్గు పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 12వ వేజ్‌బోర్డు వేతన సవరణ చర్చల్లో బొగ్గు పెన్షన్‌దారుల సమస్యలను కూడా ప్రధాన డిమాండ్లుగా చేర్చాలని, ముఖ్యంగా గత 25 సంవత్సరాలుగా పెంపుదలకు నోచుకోని కోల్ మైన్స్ పెన్షన్‌ను కరువు భత్యంతో కూడిన 50 శాతం పెంపు చేసేలా జాతీయ కార్మిక సంఘాలు కృషి చేయాలని కోరారు. అతి తక్కువ పెన్షన్ పొందుతున్న బొగ్గు పెన్షన్‌దారులకు కనీస పెన్షన్‌ను రూ.15,000గా నిర్ణయించే విధంగా వేతన సవరణ చర్చల్లో డిమాండ్ చేయాలని, అలాగే సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు అందుతున్న సీపీఆర్ఎంఎస్ వైద్య సౌకర్యాల పరిమితిని ప్రస్తుత రూ.8 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెరిగిన గ్రాట్యుటీ సీలింగ్‌ను అధికారులకు మాదిరిగానే విశ్రాంత ఉద్యోగులకు కూడా 2017 సంవత్సరం నుంచే అమలు చేసే విధంగా జాతీయ కార్మిక సంఘాల నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ సింగరేణిలో జరిగే యూనియన్ ఎన్నికల్లో విశ్రాంత ఉద్యోగులకు ఓటు హక్కు లేదనే ఉద్దేశంతోనే బొగ్గు పెన్షన్‌దారుల సమస్యలను జాతీయ కార్మిక సంఘాల నాయకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే విశ్రాంత ఉద్యోగులకు సింగరేణి ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోయినా, కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న తమ



కొడుకులు, అల్లుళ్లు, కూతుళ్లు దాదాపు 15--16 వేల మంది ఉన్న విషయాన్ని జాతీయ కార్మిక సంఘాలు మరిచిపోకూడదని అన్నారు. విశ్రాంత ఉద్యోగులు, బొగ్గు పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయని జాతీయ, ప్రాంతీయ కార్మిక సంఘాలను రాబోయే సింగరేణి యూనియన్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ నెల 09-09-2026 బుధవారం ఉదయం 9 గంటల నుంచి నస్పూర్‌లోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ మహాసమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ మహాసమ్మేళనంలో బొగ్గు పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సమగ్రంగా చర్చించి, వాటి పరిష్కారం కోసం పలు తీర్మానాలు చేయడంతో పాటు భవిష్యత్‌లో చేపట్టాల్సిన పోరాట రూపాలను నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, బొగ్గు పెన్షన్‌దారుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ ఆత్మీయ మహాసమ్మేళనాన్ని విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ఉపాధ్యక్షుడు ఎన్. సదాశివచారి, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, సలహాదారుడు హనుమంతరావు, నాయకులు ఇరుకుళ్ల జనార్దన్, సంగెం రాంచందర్, బి. జ్ఞాని, ఆర్. పర్వతాలుతో పాటు ఎల్ఐసీ కాలనీ, రామ్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్--పెద్దపల్లి--రామగుండం మంచిర్యాల--బెల్లంపల్లి రైలు కనెక్టివిటీకి కృషి

## పెద్దపల్లి, మంచిర్యాల ప్రజలకు శుభవార్త పంచుకోవడం ఆనందంగా ఉంది

## ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**హైదరాబాద్‌ను పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి ప్రాంతాలతో మెరుగైన రైలు మార్గం ద్వారా అనుసంధానం చేయాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ తెలిపారు. గత పదేళ్లుగా పెద్దపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లో రైల్వే అభివృద్ధి, కనెక్టివిటీ విషయంలో నెలకొన్న నిర్లక్ష్యాన్ని తొలగించేందుకు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే డిమాండ్లు, రైళ్ల నిలుపుదల వంటి అంశాలపై నిరంతరం ఫాలోఅప్ చేస్తూ వస్తున్నానని ఆయన అన్నారు. హైదరాబాద్ నుంచి ఉత్తర తెలంగాణ ప్రాంతాలకు మెరుగైన రైలు కనెక్టివిటీ అందుబాటులోకి వస్తే ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు వ్యాపారం, ఉద్యోగాలు, విద్య, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఈ రైలు కనెక్టివిటీ



పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఎంపీ వంశీకృష్ణ అన్నారు. ఈ కనెక్టివిటీ ఒకసారి మాత్రమే నడిచే రైలుగా కాకుండా రెగ్యులర్ రైలుగా కొనసాగుతూ తెలంగాణ ప్రజలకు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు. "మెరుగైన కనెక్టివిటీ... మరింత అభివృద్ధికి బాట. ఉత్తర తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతర కృషి కొనసాగుతుంది" అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## శ్రీరాంపూర్‌లో హరీశ్‌రావు కు ఘన స్వాగతం



**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తన్నీరు హరీశ్‌రావు ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పర్యటనకు వస్తున్న సందర్భంగా శుక్రవారం శ్రీరాంపూర్ వద్ద ఆయనకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్ తదితరులు హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లింగన్న గౌడ్ ను పరామర్శించిన జాన్సన్ నాయక్



**జన్నారం,సెప్టెంబర్4(ప్రజాజ్యోతి)** ఇటీవల కంటికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాజుల లింగన్న గౌడ్ ను బి ఆర్ ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ బుక్య జాన్సన్ నాయక్ శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కామనపల్లి సర్పంచ్ పేరం శ్రీనివాస్, ఉప సర్పంచ్ కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకురాలు ఈశ్వర బాయి, బీఆర్ఎస్ మండల నాయకులు గుర్రం రాజారాం రెడ్డి, చెట్ పల్లి సత్యం,సాయిని ప్రసాద్ నేత సులువ జనార్దన్, ఫజల్ ఖాన్, జాడి గంగాధర్, దేవయ్య,ప్రేమ్ సాగర్, పార్టీ నాయకులున్నారు.

## సాంగ్విలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

### పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం

**కెరమెరి, సెప్టెంబరు 4 ప్రజా జ్యోతి** మండలంలోని సాంగ్వి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని సర్పంచ్ కార్వేత విమల బాయి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వాడై సోని--ప్రకాశ్ దంపతులను అభినందించారు. నూతన గృహంలో



లబ్ధిదారుల కుటుంబంతో కొద్దిసేపు గడిపి యోగక్షేమా లను అడిగి తెలుసుకున్నారు. పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందు కు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని సర్పంచ్ తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామ న్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిడం హీరు, గ్రామ పెద్దలు శంకర్, మెంగు, సుంగు, బాపూరావు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి 3.33 లక్షల టన్నులు

**ఆగస్టు నెలలో 81 శాతం ఉత్పత్తి సాధన**

**ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 15.45 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి**



**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో 2026--27 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి కొనసాగుతోంది. ఆగస్టు నెలకు నిర్దేశించిన 4.09 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 3.33 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 81 శాతం లక్ష్యాన్ని చేరుకుంది. గత ఏడాది ఆగస్టులో 4.05 లక్షల టన్నుల ఉత్పత్తి జరగగా, ఈ ఏడాది ఆగస్టులో 72,136 టన్నుల మేర తక్కువగా ఉత్పత్తి నమోదైంది. ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 31 వరకు శ్రీరాంపూర్ ఏరియాలో 23.21 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ఉండగా, 15.45 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించబడింది. దీంతో 67 శాతం లక్ష్య సాధన నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో 23.90 లక్షల టన్నుల ఉత్పత్తి జరగగా, ప్రస్తుత ఏడాది 8.46 లక్షల టన్నుల మేర తగ్గింది. భూగర్భ గనుల విభాగంలో ఆగస్టు నెలకు 1.19 లక్షల టన్నుల లక్ష్యానికి 1.14 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 96 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు భూగర్భ గనుల్లో 5.91 లక్షల టన్నుల లక్ష్యానికి 5.74 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 97 శాతం లక్ష్యాన్ని చేరుకోవడం విశేషం. ఓపెన్‌కాస్ట్ గనుల విభాగంలో ఆగస్టు నెలకు 2.90 లక్షల టన్నుల లక్ష్యానికి 2.19 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 75 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఓపెన్‌కాస్ట్ గనుల్లో 17.30 లక్షల టన్నుల లక్ష్యానికి 9.71 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే సాధించడంతో 56 శాతం లక్ష్య సాధన నమోదైంది. గని వారీగా పరిశీలిస్తే ఎస్ఆర్‌పీ-1 గని 112 శాతం, ఆర్కే-ఎన్‌టీ 102 శాతం, ఆర్కే-6 మరియు ఆర్కే-7 గనులు 100 శాతం, ఎస్ఆర్‌పీ-3 అండ్ 3ఏ గని 100 శాతం లక్ష్య సాధనతో ముందంజలో ఉన్నాయి. మరోవైపు ఐకే-1ఏ గనిలో 84 శాతం, ఎస్ఆర్‌పీ ఓసీ-2లో 86 శాతం, ఐకే ఓసీపీలో 43 శాతం లక్ష్య సాధన నమోదైంది. మట్టి తవ్వకంలో ఆగస్టు నెలకు 21.02 లక్షల ఎల్‌బీసీఎం లక్ష్యానికి 18.79 లక్షల ఎల్‌బీసీఎం సాధించి 89 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 79.77 లక్షల ఎల్‌బీసీఎం లక్ష్యానికి 77.35 లక్షల ఎల్‌బీసీఎం సాధించి 97 శాతం లక్ష్య సాధన నమోదైంది. బొగ్గు రవాణాలో ఆగస్టు నెలలో రైలు మార్గం ద్వారా 3,28,215 టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 22,586 టన్నులు, మొత్తంగా 3,50,801 టన్నుల బొగ్గు డిస్పాచ్ జరిగింది. గత ఏడాది ఆగస్టులో 4,21,274 టన్నుల డిస్పాచ్ జరగగా, ఈ ఏడాది 70,473 టన్నుల మేర తగ్గింది. ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 31 వరకు రైలు, రోడ్డు మార్గాల ద్వారా కలిపి 15,69,924 టన్నుల బొగ్గు డిస్పాచ్ జరిగింది. ఈ కాలంలో మొత్తం 381 రేకులు వినియోగించగా, గత ఏడాది 616 రేకులు వినియోగించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2026--27 ఆర్థిక సంవత్సరానికి శ్రీరాంపూర్ ఏరియాకు మొత్తం 64.30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా, గనుల వారీగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, ఓసీ గనుల్లో లక్ష్య సాధనను మెరుగు పరచడం ద్వారా రానున్న నెలల్లో ఉత్పత్తి లోటును అధిగమించాల్సిన అవసరం ఉంది.

# మాది ప్రజల ప్రభుత్వం.

**--రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్.**



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 4(ప్రజాజ్యోతి):** మాది ప్రజల ప్రభుత్వంమని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలువురు నూతన వధూవరులను ఆశీర్వదించి, మండలంలోని పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, పెన్షన్స్, రైతు భరోసా, పారిశ్రామిక విధానం, విద్య, వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యత ఏ రాష్ట్రంలో కూడా లేదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా పని చేస్తుందన్నారు. ప్రతి పక్షాల అనవసర మాటలు పట్టించుకునే స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వం లేదన్నారు. ప్రజా పాలనకు మేము కట్టుబడి ఉన్నామని వివరించారు. మాకు ప్రజల దీవెనేలే ముఖ్యమని, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్ని నిధులు అయినా కేటాయించి అభివృద్ధి చేస్తారని వివరించారు. అంతకుముందు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారి నరేందుల సతీష్, మూల కిషన్ గౌడ్ కుటుంబాల నూతన వధూవరులను ఆశీర్వదించారు. అంతకుముందు సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పలు రకాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం చందారంలో మాజీ ఎంపీపీ అన్నం మంగ చిన్నన్న,తాజా మాజీ జడ్పీటీసీ ముత్తే సత్తయ్య కుటుంబాలను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంతెన జగన్ మోహన్ రావు, కౌన్సిలర్లు రాయలింగు, రాజేంద్ర ప్రసాద్, బిరుదుల సత్యనారాయణ, గుల్లకోట సర్పంచ్ దేవమ్మ భీమయ్య, ఉప సర్పంచ్ భూపెల్లి మల్లేష్, నాయకులు పెరుగు తిరుపతి, మినుముల శాంతి కుమార్, రంజిత్ సింగ్, అమీర్, గౌస్, రషీద్ షేక్, తొగరు రాజు, దమ్మ సునీల్, దండేపల్లి మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, కొండ నరేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా పరిపాలనలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు విశిష్ట ప్రతిభా పురస్కారం



**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**విద్యా పరిపాలనలో విశిష్ట ప్రతిభా పురస్కారం--2026కు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణా ఉత్తర్వులు జారీ చేశారు. 2026--27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్య సాధనలో మంచిర్యాల జిల్లా విశిష్ట ప్రతిభ కనబరిచింది. 2025--26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 43,072 మంది విద్యార్థులు ఉండగా, 2026--27లో ఆ సంఖ్య 45,626కు పెరిగింది. దీంతో ఒక్క ఏడాదిలోనే 2,554 మంది విద్యార్థులు అదనంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. 2024--25తో పోల్చితే రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 10.34 శాతం పెరగడం విశేషం. జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలల్లో 10 శాతానికి పైగా అదనపు నమోదు సాధించారు. ముఖ్యంగా మందమర్రి, నస్పూర్, జైపూర్, హాజీపూర్, భీమారం మండలాల్లో 10 శాతానికి పైగా విద్యార్థుల నమోదు పెరిగింది. అదేవిధంగా 2026--27 విద్యా సంవత్సరంలో 4,346 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మార్గదర్శకత్వంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి. చంద్రయ్య, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్, సీసీఓలు, సీఆర్పీలు సమన్వయంతో చేపట్టిన కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ, సమష్టి కృషి ఈ విజయానికి దోహదపడింది. సెప్టెంబర్ 5న కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ పురస్కారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో పాటు మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది సమష్టి కృషికి లభించిన గుర్తింపుగా, మంచిర్యాల జిల్లాకు రాష్ట్రస్థాయిలో దక్కిన విశిష్ట గౌరవంగా నిలిచింది.

# ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ సర్కార్‌లిజాన్సన్ నాయక్

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన పై జాన్సన్ నాయక్ ఫైర్

**జన్నారం,సెప్టెంబర్4(ప్రజాజ్యోతి)** ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరిట ప్రజలను నమ్మించి 1000 రోజులైనా కానీ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మండల కేంద్రంలోని ధర్మారం చౌరస్తా నుండి తెలంగాణ తల్లి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ బాకీ కార్డులు పంపిణీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద లక్ష 16 వేల తో పాటు తులం బంగారం, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000, నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి





వంటి హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, పంటలకు బోనస్, రైతు కూలీలు, ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ద ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేసేందుకే 'బాకీ కార్డుల' కార్యక్రమాన్ని చేపట్టామని,ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని, ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచిందని, ఖానాపూర్ నియోజకవర్గ ప్రజల సమస్యలపై ఇకముందు కూడా నిరంతరం పోరాటం చేస్తామని భూక్యా జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చారులత రాథోడ్, పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, సులువ జనార్ధన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్, ఫజల్ ఖాన్, మున్వర్ అలీ ఖాన్ భరత్ కుమార్, జాడి గంగాధర్, సాయిని ప్రసాద్ నేత, రాములు నాయక్, శ్రీనివాస్ రెడ్డి, జంగం సంతోష్,సి. హెచ్. సత్యం, ప్రేమ్ సాగర్,తదితరులు పాల్గొన్నారు

# రోజుకు 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలి

### అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం

**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేయడంపై సింగరేణి సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా రోజుకు 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి శుక్రవారం సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణాపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ఇంధన శాఖలు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరాపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయని తెలిపారు. దేశ ఇంధన భద్రతను దృష్టిలో పెట్టుకుని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి సంస్థలపై ఉందని, అందువల్ల సింగరేణి కూడా శక్తివంచన లేకుండా బొగ్గు ఉత్పత్తి, రవాణాను పెంచాలని ఆయన సూచించారు. ఈ క్రమంలో ఏరియాల వారీగా ఇప్పటివరకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు.

**ఐదు నెలల్లో 253 లక్షల టన్నుల బొగ్గు రవాణా**

ఆగస్టు 31 నాటికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలల కాలం పూర్తయిందని, ఈ కాలంలో సింగరేణి సంస్థ 253 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిందని అధికారులు సీఎండీకి వివరించారు. ఇందులో 90 శాతానికి పైగా బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేసినట్లు తెలిపారు. అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలని సీఎండీ స్పష్టం చేశారు.

**నైనీ బొగ్గు రాష్ట్ర థర్మల్ కేంద్రాలకు**

ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మొదటి రైల్వే రేకుతో బొగ్గు సరఫరా చేసినట్లు సీఎండీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి కూడా ఇటీవల మరో రేకు బొగ్గు సరఫరా చేసినట్లు వివరించారు. ఇకముందు రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నైనీ బ్లాక్ నుంచి రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

**ఓబీ తొలగింపుపై ప్రత్యేక దృష్టి**

బొగ్గు ఉత్పత్తి, రవాణాతో పాటు ఓవర్ బర్డెన్ (ఓబీ) తొలగింపుపై కూడా సీఎండీ సమీక్షించారు. ఆగస్టు నెలాఖరు వరకు ఆఫ్‌లోడింగ్ ద్వారా 1,315 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించినట్లు అధికారులు వివరించారు. అయితే నిర్దేశించిన లక్ష్యంతో పోలిస్తే ఇది 95 శాతం మాత్రమే కావడంతో, ఓబీ తొలగింపు లక్ష్యాలను నూరు శాతానికి మించి సాధించేలా ఆఫ్‌లోడింగ్ ఏజెన్సీలను సమాయత్తం చేయాలని సీఎండీ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టిన ప్రస్తుత పరిస్థితులు బొగ్గు ఉత్పత్తికి అనుకూలంగా ఉన్నందున రోజువారీ లక్ష్యాలను అధిగమించి




ఉత్పత్తి సాధించాలని సూచించారు. రైల్వే విభాగం అధికారులతో సమన్వయం చేసుకుంటూ బొగ్గు రవాణాలో కూడా నూరు శాతానికి మించి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

**రక్షణ ప్రమాణాలు, నాణ్యతకు ప్రాధాన్యం**

ఉత్పత్తి, రవాణా పెంపుతో పాటు రక్షణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్దేశిత నాణ్యత కలిగిన బొగ్గును సరఫరా చేయాలని సీఎండీ సూచించారు. సంస్థ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు సమష్టిగా కృషి చేసినప్పుడే నిర్దేశించిన లక్ష్యాలను సాధించగలమని ఆయన అన్నారు . ఈ సమీక్షా సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# లక్షెట్టిపేటలో వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు, కుంకుమ పూజలు



**లక్షెట్టిపేట సెప్టెంబర్ 04(ప్రజాజ్యోతి):** పట్టణంలోని బీట్ బజార్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం పట్టణ మహిళా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పవిత్ర వేడుకల్లో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా లక్షెట్టిపేట పట్టణ మహిళా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు నరేందుల సాహితీ మాట్లాడుతూ ప్రతి ఏటా వాసవి మాత ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకుంటున్నామని, ఈ ఏడాది కూడా మహిళలందరి సహకారంతో వేడుకలను ఘనంగా జరుపుకున్నట్లు తెలిపారు. హిందూ ధర్మంలో అమ్మవారికి చేసే కుంకుమ పూజ అత్యంత శక్తివంతమైనదని, ఈ పూజలు ఆచరించడం ద్వారా మహిళలకు అఖండ సౌభాగ్యం కలుగుతుందని, ఆ సౌభాగ్యమే మహిళలకు శ్రీరామరక్ష అని ఆమె పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేసి, భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు నరేందుల సాహితి, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల ఆరతి, కోశాధికారి కాసం స్వప్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎనగందుల శరణ్య, గౌరవ సలహాదారులు చెట్ల రమ్య, ఉత్తూరి రజిత ఉపాధ్యక్షులు సామ లావణ్య, చిట్టు మల్ల విజయ, రావికంటి సుమలత, గుండ లత శ్రీ, సిదురాల సోనీ, జైన స్రవంతి, సామ జయ, ఆలయ కమిటీ సభ్యులు పలువురు సంఘం సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలి

**జేఏసీ చైర్మన్ మడావి గుణవంత్ రావు**

**అటవీ శాఖ కార్యాలయం ముట్టడి.. నిరాహార దీక్ష**



**తిర్యాణి సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):** రొంపల్లి అటవీ ప్రాంతంలో మేకలు మేపుతున్న మోడిశే శంకర్‌పై ఎలుగుబంట్లు దాడి చేయగా తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఎలుగుబంట్ల దాడిలో తీవ్రంగా గాయపడిన మోడిశే శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కుల సంఘాల జేఏసీ చైర్మన్ మడావి గుణవంత్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం తిర్యాణి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని జేఏసీ నాయకులు ముట్టడించి నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకలు మేపుతుండగా ఎలుగుబంట్లు దాడి చేయడంతో శంకర్ తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుటుంబ సభ్యులు కూడా గాయపడటంతో విషాదం మరింత పెరిగిందన్నారు. శంకర్ వైద్య ఖర్చులను ప్రభుత్వమే పూర్తిగా భరించడంతోపాటు, బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలన్నారు. అటవీ ప్రాంతాల్లో ఎలుగుబంట్ల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు అటవీశాఖ తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వెద్మ భగవంత్ రావు, బొమ్మ గోని శంకర్‌గౌడ్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, బుధబాయి, దశరథం, కుదురుపాక పవన్ ఏదుల శీను జైనేని చంద్రశేఖర్, మడావి చిరంజీవి, వల్క శ్రీధర్, సారా రమేష్ గౌడ్, రంగు లచ్చ గౌడ్,అర్జున్,జుగనక జంగు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పాలనపై వేడెక్కిన రాజకీయం

## కాంగ్రెస్ సంబరాలు.. బీఆర్ఎస్ నిరసన



**తిర్యాణి సెప్టెంబర్ 4(ప్రజా జ్యోతి):**కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు ప్రస్తావిస్తుండగా.. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, స్థానిక సమస్యలపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తిర్యాణిలో ఇరుపార్టీలు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించారు. కొమురం భీం చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటా వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు హనుమాండ్ల జగదీష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను ఘనంగా ప్రచారం చేసుకుంటున్నా.. ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలు కాలేదని ఆరోపించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కోవా లక్ష్మీ ఆధ్వర్యంలో తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.మరోవైపు కాంగ్రెస్ పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుతో పాటు సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.వెయ్యి రోజుల పాలనపై అధికార పక్షం అభివృద్ధి, సంక్షేమాన్ని లెక్కగా చూపిస్తుండగా.. ప్రతిపక్షం హామీల అమలు, స్థానిక సమస్యలను ఎత్తిచూపుతోంది. దీంతో ఇరుపార్టీల కార్యక్రమాలతో తిర్యాణిలో వెయ్యి రోజుల పాలనపై రాజకీయ వాతావరణం వేడెక్కింది.

## ఈవీఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు



**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం నస్పూర్‌లోని ఈవీఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. గోదాము వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోదాము పరిసరాలను 24 గంటల పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కిష్టాపూర్ ప్రధానోపాధ్యాయులు



**జన్నారం,సెప్టెంబర్4 (ప్రజాజ్యోతి)** జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధాన ఉపాధ్యాయులు గుండ రాజన్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. శనివారం రోజు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడంగల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. జాతీయ ఉపకార వేతనాలకు గత మూడు సంవత్సరాలుగా అత్యధిక విద్యార్థులు ఈ పాఠశాల నుండి ఎంపికయ్యారు. అంతేకాకుండా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో మరియు ఆర్జీయూకేటీలో ఎక్కువ మంది విద్యార్థులు ఎంపిక కావడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. ఎస్ఎస్సి ఫలితాల్లో 582 మార్కులు పొంది జిల్లా స్థాయిలోనే అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులుగా కిష్టాపూర్ పాఠశాల విద్యార్థులు నిలిచారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయి మరియు జాతీయస్థాయిలో విద్యార్థులకు అవార్డు రావడంలో ఆయన ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకోనున్న గుండ రాజన్న మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దామని, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన గుండ రాజన్నను గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, మండల విద్యాధికారి రాజేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంగ మరియు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# భక్తిశ్రద్ధలతో కన్నెపల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

## వేడుకల్లో పాల్గొన్న పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్



**తిర్యాణి, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి):** మండలంలోని కన్నెపల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్‌తో పాటు గ్రామ ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుంచు శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ధర్మ పరిరక్షణ, న్యాయ స్థాపన కోసం శ్రీకృష్ణుడు చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. శ్రీకృష్ణాష్టమి వంటి పండుగలు ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామాల్లో సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో చాకటి సంతోష్, గ్రామ ప్రజలు, యువత, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుకలకు దూరంగా.. అనాథ పిల్లలకు అండగా




**మందమర్రి , సెప్టెంబర్ 04(ప్రజాజ్యోతి ):** పుట్టినరోజు వేడుకలను ఆర్భాటంగా నిర్వహించకుండా నిరుపేద కుటుంబానికి చేయూతనిచ్చి సేవాభావాన్ని చాటుకున్నారు మహమ్మద్ ఆబిద్. మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ఏరియా డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో చంటి రమేష్, మల్లేశ్వరి దంపతులు మృతి చెందారు. తల్లిదండ్రులను కోల్పోయిన వారి ఇద్దరు పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్న విషయం స్థానికుల ద్వారా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ దృష్టికి వచ్చింది. విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు మహమ్మద్ ఆబిద్‌ను సంప్రదించి కుటుంబ పరిస్థితిని వివరించారు. దీంతో స్పందించిన ఆబిద్ తన పుట్టినరోజు సందర్భంగా ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నందిపాటి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు భవిష్యత్తులో చదువు, ఇతర అవసరాల్లో సొసైటీ అండగా ఉంటుందని తెలిపారు. ఆపదలో ఉన్నవారి వివరాలను తమ దృష్టికి తీసుకువస్తే వీలైనంత సహాయం అందిస్తామని పేర్కొన్నారు. పుట్టినరోజును సేవా కార్యక్రమానికి అంకితం చేసి నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన మహమ్మద్ ఆబిద్‌కు సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పృథ్వి, మధు, ఎండీ జావిద్ పాషా, శ్రీనివాస్, మామిడి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లిగడ్డ ధర మంట.. సామాన్యుడి వంటింటికి కంటతడి!




**మంచిర్యాలరూరల్ సెప్టెంబర్04(ప్రజాజ్యోతి)** వంటింట్లో తప్పనిసరి సరుకుగా మారిన ఉల్లిగడ్డ ఇప్పుడు సామాన్యుడికి భారంగా మారింది. గత నెలలో కిలో రూ.40కు లభించిన ఉల్లిగడ్డ ధర ప్రస్తుతం రూ.60కు చేరడం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న వేళ ఉల్లిగడ్డ ధర కూడా ఒక్కసారిగా పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.

**--ధర పెరుగుతున్నా.. పర్యవేక్షణ ఏది?**

ఉల్లిగడ్డ ధర పెరుగుదలకు అసలు కారణం ఏమిటి? మార్కెట్‌లో సరఫరా తగ్గిందా?మధ్యవర్తుల పాత్ర ఉందా?లేక కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా?అన్న ప్రశ్నలు వినియోగదారుల నుంచి వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో ఉల్లిగడ్డ ధరలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

**--సామాన్యుడి వంటింటిపై భారం**

రోజువారీ కూలీలు, పేద కుటుంబాలు నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కిలో ఉల్లిగడ్డపై అదనంగా రూ.20 భారం పడటం చిన్న విషయం కాదని వినియోగదారులు అంటున్నారు. ధరలు పెరిగినప్పుడు సామాన్యుడిపై పడే భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**--పౌరసరఫరాల శాఖ జోక్యం ఎప్పుడు?**

ధరల పెరుగుదలపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మార్కెట్‌ను పరిశీలించి,సరఫరా పరిస్థితిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. అవసరమైతే రైతుబజార్లు లేదా ప్రభుత్వ ఆధ్వర్యంలోని విక్రయ కేంద్రాల ద్వారా ఉల్లిగడ్డలను తక్కువ ధరకు అందించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ధరల పెరుగుదలపై అధికారులు దృష్టి సారిస్తారా?లేక సామాన్యుడి కన్నీళ్లే మిగులుతాయా? అన్నది వేచి చూడాల్సిందే.

# బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలగించడం తీవ్రంగా ఖండిస్తున్నాం

**కాంగ్రెస్‌లో బీసీలకు ఒక న్యాయం.. రెడ్లకు మరో న్యాయమా?**

**బీసీలను అణగదొక్కే రాజకీయ కుట్రలను సహించం:**

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్**



**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** బీసీ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖను, ఆమె కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు బాధ్యురాలిని చేస్తూ మంత్రి పదవి నుంచి తొలగించడాన్ని బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తోందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఒక బీసీ మహిళా మంత్రిని మంత్రి పదవి నుంచి తొలగించే విషయంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరుపై బీసీ సమాజ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ఒక విధానం, రెడ్డి సామాజిక వర్గానికి మరో విధానం కొనసాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గతంలో పలు సందర్భాల్లో బహిరంగంగా పార్టీపై విమర్శలు చేసినప్పటికీ వారిపై ఇదే తరహాలో కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై బహిరంగంగా విమర్శలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నప్పటికీ, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకుల విషయంలో ఒక విధంగా, బీసీ నాయకుల విషయంలో మరో విధంగా వ్యవహరించడం ఏమిటని నిలదీశారు. "బీసీ మహిళా మంత్రికి ఒక న్యాయం.. రెడ్డి నాయకులకు మరో న్యాయమా?" అని నరెడ్ల శ్రీనివాస్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో రెడ్ల రాజ్యం కొనసాగుతోందని, బీసీలను రాజకీయంగా అణగదొక్కేందుకు కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. బీసీలకు రాజకీయంగా ఎదిగే అవకాశం వచ్చిన ప్రతిసారీ వారిని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ధోరణిని బీసీ సమాజ్ ఎంతమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. బీసీలను కేవలం ఓట్ల కోసం ఉపయోగించుకుని, అధికారం విషయంలో మాత్రం అణగదొక్కే రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ స్వస్తి పలకాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలపై వివక్షను విడనాడి, అన్ని సామాజిక వర్గాలకు సమాన న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికైనా తెలంగాణలోని బీసీ మంత్రులు, బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ నాయకులు కళ్లుతెరిచి కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలను గమనించాలని నరెడ్ల శ్రీనివాస్ సూచించారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ రాజకీయ నిర్ణయాన్నైనా బీసీ సమాజ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, బీసీలకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. "బీసీలను అణగదొక్కే రాజకీయాలకు తెలంగాణ ప్రజలు తప్పకుండా గుణపాఠం చెబుతారు. బీసీల రాజకీయ చైతన్యం ఇక ఆగదు" అని నరెడ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షులు వైద్య భాస్కర్, బొలిశెట్టి లక్ష్మణ్, జిల్లా నాయకులు బియ్యాల సత్తయ్య, జక్కం రవీందర్, బీసీ సమాజ్ పట్టణ నాయకులు వెన్నంపల్లి మురళి, గుండ్ల లక్ష్మణ్, ఎండి షఫీ, కొడుకా మోహన్, పల్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వాంకిడి కేంద్రంలో ఆర్ఎంపీల వైద్యం.. నిబంధనలు గాలిలోనా?

**శిథిలావస్థలో క్లినిక్‌లు.. వైద్య సేవలపై పర్యవేక్షణ ఏది?మందుల వినియోగం, క్లినిక్‌ల నిర్వహణపై అధికారుల తనిఖీలు ఎక్కడ?**

**అర్హతకు మించిన వైద్యం చేస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరపాలంటున్న ప్రజలు**

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో కొందరు ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌ల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండటం అవసరమే అయినప్పటికీ.. వైద్య సేవలు అందించే ప్రదేశాలు కనీస భద్రతా ప్రమాణాలతో ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగా క్లినిక్‌లు నిర్వహిస్తున్నారా? అన్నదే ప్రస్తుతం ప్రధాన ప్రశ్నగా మారింది. తాజాగా కనిపిస్తున్న క్లినిక్ పరిస్థితులను పరిశీలిస్తే భవనం పాతబడిపోయి గోడలు దెబ్బతిన్నట్లు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇటుకలు బయటకు కనిపిస్తుండగా, పైకప్పు భాగంలోనూ పగుళ్లు, దెబ్బతిన్న నిర్మాణం స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి వాతావరణంలో రోగులకు వైద్య సేవలు అందించడం ఎంతవరకు సురక్షితమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### క్లినిక్ ఉందా.. లేక ఇంట్లోనే వైద్యమా?

మరోవైపు కొన్ని చోట్ల ఇల్లు, క్లినిక్ మధ్య తేడా లేకుండా వైద్య సేవలు కొనసాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. రోగులు కూర్చునేందుకు, వేచి ఉండేందుకు సరైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన వైద్య సదుపాయాలు ఉన్నాయా అనే అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది. వైద్య కేంద్రంలో టేబుల్, కుర్చీలు, కొన్ని మందులు, వైద్య సామగ్రి కనిపించడం సహజమే అయినప్పటికీ.. మందులు ఏ విధంగా నిల్వ చేస్తున్నారు? వాటి గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారా? రోగులకు మందులు ఇవ్వడానికి సరైన వైద్య సూచనలు పాటిస్తున్నారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

### చిన్న జబ్బుకు.. పెద్ద చికిత్స?

గ్రామీణ ప్రాంతాల్లో జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి వంటి సాధారణ సమస్యలకు ప్రజలు మొదటగా సమీపంలోని ఆర్ఎంపీలను సంప్రదిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం ఉన్నా.. కొందరు ప్రజలు ఆర్థిక పరిస్థితులు, దూరం వంటి కారణాలతో స్థానికంగానే చికిత్స పొందేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో రోగి ఆరోగ్య పరిస్థితిని సరిగ్గా అంచనా వేయడం, అవసరమైనప్పుడు వెంటనే ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేయడం ఎంతో ముఖ్యమని స్థానికులు అంటున్నారు. అర్హతకు మించిన వైద్య సేవలు ఎక్కడైనా అందుతున్నాయా? అన్న అంశాన్ని అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు.

### మందులపై ప్రత్యేక నిఘా అవసరం

క్లినిక్‌లలో మందుల వినియోగం కూడా కీలక అంశంగా మారింది. గడువు ముగిసిన మందులు వినియోగిస్తున్నారా? మందులను సరైన



ఉష్ణోగ్రత, పద్ధతిలో భద్రపరుస్తున్నారా? అవసరమైన రికార్డులు నిర్వహిస్తున్నారా? వంటి అంశాలపై తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ప్రత్యేకంగా ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్స్ వంటి మందుల విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని వారు కోరుతున్నారు. ఏదైనా ఆరోగ్య సమస్య తీవ్రతరం అయితే దాని ప్రభావం నేరుగా రోగిపైనే పడుతుందని, అందువల్ల వైద్య సేవల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని అంటున్నారు.

### అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

మండల కేంద్రంలోనే పలు ప్రైవేట్ వైద్య కేంద్రాలు కొనసాగుతున్న నేపథ్యంలో సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్లినిక్‌లలో పనిచేస్తున్న వారి అర్హతలు, రిజిస్ట్రేషన్, అందిస్తున్న వైద్య సేవల పరిధి, మందుల నిల్వ తదితర అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. కేవలం ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే తనిఖీలు కాకుండా.. ముందస్తుగా కూడా తనిఖీలు నిర్వహించాలి అని స్థానికులు కోరుతున్నారు. దీనివల్ల నిబంధనలను పాటించే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### శిథిల భవనాల్లో వైద్యం ఎంతవరకు సురక్షితం?

ప్రస్తుతం చర్చకు వచ్చిన క్లినిక్ భవన పరిస్థితిపై కూడా అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు అంటున్నారు. భవనం బలహీనంగా ఉంటే రోగులు, సిబ్బంది భద్రతకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. గోడలు, పైకప్పు, విద్యుత్ వైరింగ్, గాలి, వెలుతురు, పరిశుభ్రత వంటి ప్రాథమిక అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. రోగి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ప్రదేశం ముందుగా సురక్షితంగా ఉండాలన్నది ప్రజల అభిప్రాయం.



### ప్రభుత్వ ఆసుపత్రిపై కూడా నమ్మకం పెంచాలి

మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, మందులు, పరీక్షలు అందుబాటులో ఉంటే ప్రజలు అనవసరంగా ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయించే పరిస్థితి తగ్గుతుందని చెబుతున్నారు. ప్రజలకు సరైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు.. ప్రైవేట్‌గా వైద్య సేవలు అందిస్తున్న కేంద్రాలపై కూడా నిఘా ఉండాలని కోరుతున్నారు. స్పందించాల్సిన వైద్య ఆరోగ్య శాఖ వాంకిడి మండల కేంద్రంలో ఆర్ఎంపీలుగా వైద్య సేవలు అందిస్తున్న వారి వివరాలను సంబంధిత అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఎవరెవరికి ఎలాంటి అర్హతలు ఉన్నాయి? ఏ పరిధిలో వైద్య సేవలు అందిస్తున్నారు? క్లినిక్‌ల నిర్వహణ నిబంధనలకు అనుగుణంగా ఉందా? అనే అంశాలపై సమగ్ర తనిఖీ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. తప్పులు లేకుండా నిబంధనలకు అనుగుణంగా సేవలు అందిస్తున్న వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు అంటున్నారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన విషయం కాబట్టి అధికారులు నిర్లక్ష్యం చేయకూడదు. వైద్య సేవల పేరుతో ఏం జరుగుతుందో పరిశీలించి, ప్రజలకు భరోసా కల్పించాలి" అని స్థానికులు కోరుతున్నారు. మొత్తంగా వాంకిడి మండల కేంద్రంలోని ఆర్ఎంపీ క్లినిక్‌ల నిర్వహణ, వైద్య సేవల పరిధి, మందుల వినియోగం, భవనాల భద్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకువస్తారా.. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటారా అన్నది వేచి చూడాల్సిందే.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా నుంచి 5 వేల మందికి తగ్గకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు తరలిరావాలి**

**టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి**

**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10న గురువారం నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శుక్రవారం మంచిర్యాల టీఎన్జీవో భవన్‌లో టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా నుంచి 5 వేల మందికి తగ్గకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో టీజీఈజేఏసీ జిల్లా కో-చైర్మన్లు పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్



బొడ్డు శ్రావణ్ కుమార్, అత్తే సుధాకర్, వైస్ చైర్మన్లు సూరినేని గంగాధర్, నాగుల గోపాల్, సెక్రటరీలు నడిమెట్ల సత్యనారాయణ, తంగళ్లపల్లి తిరుపతి, ఎస్. ప్రభుతో పాటు టీజీవో, టీఎన్జీవో నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు, జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు

# ఆరోగ్యవంతమైన ఉద్యోగులతోనే మెరుగైన ఉత్పత్తి, సంస్థ అభ్యున్నతి సాధ్యం

### జీఎం మునిగంటి శ్రీనివాస్

### శ్రీరాంపూర్ ఏరియాలో ఘనంగా అంతర్ విభాగీయ క్రీడా పోటీలు ప్రారంభం





**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**ఆరోగ్యవంతమైన ఉద్యోగుల ద్వారానే మెరుగైన ఉత్పత్తి సాధ్యమై, తద్వారా సంస్థ అభ్యున్నతి సాధ్యమవుతుందని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సింగరేణి సంస్థ క్రీడలు, ఆటల పోటీలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. శుక్రవారం ప్రగతి స్టేడియంలో శ్రీరాంపూర్ ఏరియా అంతర్ విభాగీయ క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సింగరేణి సంస్థ ఏటా నిర్వహించే వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో అంతర్ విభాగీయ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు షెడ్యూల్ ప్రకారం వాలీబాల్ పోటీల్లో తలపడే జట్లను టాస్ ద్వారా ఎంపిక చేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్న జీఎం వారికి శుభాకాంక్షలు తెలిపారు. స్వయంగా సర్వీస్ చేసి పోటీలను ప్రారంభించి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయని, ఆరోగ్యకరమైన ఉద్యోగులతోనే మెరుగైన ఉత్పత్తి సాధించి సంస్థ అభివృద్ధికి దోహదపడవచ్చని అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇందులో భాగంగా మూడు స్టేడియాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణి సంస్థ ప్రతి ఏరియాకు క్రీడా సామగ్రి కొనుగోలు కోసం రూ.4.50 లక్షలు కేటాయించిందని, ఆ నిధులతో నాణ్యమైన క్రీడా సామగ్రిని కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కంపెనీ స్థాయి బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంతో పాటు ఏరియాలో ఇతర క్రీడలకు కూడా మెరుగైన వసతులు కల్పిస్తామని అన్నారు. యాజమాన్యం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని జీఎం కోరారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి కోల్ ఇండియా స్థాయి పోటీలకు శ్రీరాంపూర్ నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడా పోటీల షెడ్యూల్‌లో భాగంగా సెప్టెంబర్ 5న బాస్కెట్‌బాల్, సెప్టెంబర్ 6న షటిల్ బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళలు), టేబుల్ టెన్నిస్ (పురుషులు, మహిళలు), చెస్, క్యారమ్స్, సెప్టెంబర్ 7న బాల్ బ్యాడ్మింటన్, సెప్టెంబర్ 8న ఫుట్‌బాల్, సెప్టెంబర్ 9న హాకీ, సెప్టెంబర్ 10న లాన్ టెన్నిస్, సెప్టెంబర్ 11న కబడ్డీ, సెప్టెంబర్ 12, 13 తేదీల్లో క్రికెట్, సెప్టెంబర్ 15న అథ్లెటిక్స్ (పురుషులు, మహిళలు), త్రోబాల్ (మహిళలు), స్విమ్మింగ్ (పురుషులు), సెప్టెంబర్ 20న సాంస్కృతిక కార్యక్రమాలు (పురుషులు, మహిళలు), సెప్టెంబర్ 27న పవర్ లిఫ్టింగ్ (పురుషులు, మహిళలు), బాడీ బిల్డింగ్ (పురుషులు) పోటీలు నిర్వహించనున్నారు. తొలిరోజు జరిగిన వాలీబాల్ పోటీల్లో ఆర్‌కే-5 గ్రూప్ విజేతగా, ఆర్‌కే-7 గ్రూప్ రన్నరప్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ కందికట్ల వీరభద్రయ్య, ఏజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ తోట సురేష్, జనరల్ కెప్టెన్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడి వేశాధారణలో అలరించిన కళాకారులు



**లక్సెట్టిపేట సెప్టెంబర్ 4(ప్రజాజ్యోతి)**మండలం లోని తిమ్మాపూర్ గ్రామంలో కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిమ్మాపూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది. కన్నులపండువగా జరిగిన శ్రీకృష్ణుడి ఉత్సవాల్లో "గోపాల కాలువలు" కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామంలోని వీధులన్నీ కృష్ణాష్టమి సంబరాలతో మార్మోగిపోయాయి.కృష్ణుడి వేషాధారణలో చిన్న పిల్లలు, కళాకారులు అభినయిస్తూ అలరించారు. నెమలి పింఛం, చేతిలో మురళి, మెడలో పూలదండలతో గోపాలుడిగా మెరిసిన చిన్నారులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. తమ చిన్ని చిన్ని అడుగులతో, ముద్దు ముద్దు మాటలతో గ్రామంలోని వీధుల్లో సంచరిస్తూ నందకిశోరుడి లీలలను కళ్లముందు ఉంచారు.ఈ వేడుకల ప్రధాన విశేషం ఏంటంటే... కాలక్రమేణా అంతరించిపోతున్న మన జానపద, సాంస్కృతిక కళారూపాలకు ఈ వేడుక వేదికగా మారింది. స్థానిక కళాకారులు తమ ప్రదర్శనలతో అంతరించిపోతున్న ప్రాచీన కళలకు తిరిగి జీవం పోశారు. బుర్రకథలు, కోలాటాలు, తప్పెట గుళ్లు మరియు సాంస్కృతిక నృత్యాలతో గ్రామంలో కోలాహలం నెలకొంది.ఊరంతా ఒకచోటకు చేరి, భక్తిశ్రద్ధలతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు ఈ సందర్భంగా కళాకారులు భగవద్గీత బోధకులు గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ, సంప్రదాయ అనుసరించారు. యోగ, ధ్యాన, భగవద్గీత జ్ఞాన కమిటి తిమ్మాపూర్ ఆధ్వర్యంలో, చాలా ఘనంగా నిర్వహించారు. ఒక తిమ్మాపూర్ వాసులే కాకుండా చుట్టుపట్ల గ్రామాల నుండి ప్రజలు తిలకించారు. ఈ కార్యక్రమంలో గురువులు లక్ష్మీనారాయణ, పెట్టెం శంకరయ్య, అంజయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా చైర్మన్ పదవికి టేకం గంగారాం దరఖాస్తు



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి** ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ పదవికి అంకుసాపురం సర్పంచ్ టేకం గంగారాం దరఖాస్తు చేసుకున్నారు. ఆదివాసీ కాంగ్రెస్ నియామకాల అబ్జర్వర్ గణేష్ రాథోడ్‌కు తన దరఖాస్తును అందజేశారు. ప్రస్తుతం ఆదివాసీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న గంగారాం.. జిల్లా స్థాయిలో పార్టీకి సేవలందించే అవకాశం కల్పించాలని కోరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు ఆదివాసీ ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా చైర్మన్‌గా అవకాశం కల్పిస్తే పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

## ఖానాపూర్ లొ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన 1000 రోజుల విజయోత్సవ సంబరాలు



**ఖానాపూర్ సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)** తెలంగాణ లో కాంగ్రెస్ ప్రజా పాలన విజయవంతంగా 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకుని,విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఖానాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజులుగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేద కుటుంబాల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతుండడం వల్లే ప్రజా పాలనపై ప్రజల విశ్వాసం మరింత బలపడిందని పేర్కొన్నారు.అలాగే డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే శ్రీ వెడ్మ బొజ్జు పటేల్ నాయకత్వంలో ఖానాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని, గ్రామ స్థాయి వరకు పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలన విజయాలను ప్రతి ఇంటికి చేర్చడం కాంగ్రెస్ శ్రేణుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు రాజురా సత్యం డిసిసి కార్యదర్శి అంకం రాజేందర్ ఖానాపూర్ సత్తెనపల్లి పీఏసీఎస్ చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి అమంద శ్రీనివాస్ ఆత్మ కమిటీ చైర్మన్ తోటసత్యం ఏఎంసి వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజు నాయక్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ మండల పార్టీ ఉపాధ్యక్షులు దొనికిని సాగర్ నారాయణరెడ్డి కరిపే రాజు మండల ప్రధాన కార్యదర్శి కోడి మ్యాల వీరేష్ గుమ్ముల రమేష్ శ్రీనివాస్ కడార్ల గంగ నరసయ్య జమాల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావాలి సంతోష్ , నాయకులు జహీర్ భాయ్ షబ్బీర్ భాష అమనుల్లా ఖాన్ మదిరే సత్యనారాయణ ధ్యావతి రాజేశ్వర్ మహిళ నాయకులు సుజాత రమాదేవి వసంత జిల్లా మండల పట్టణ నాయకులు గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# తక్కువ వర్షానికే కొట్టుకుపోయిన కుడికాలువ!

**మాణిక్‌గూడలో నాసిరకం పనులపై సీపీఎం ఆగ్రహం**

**లక్షలాది ప్రజాధనం వృథా.. అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

**కుడికాలువ పనులపై సమగ్ర విచారణ జరపాలి**

**కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి శాశ్వత పరిష్కారం చూపాలి**

**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి** అభివృద్ధి పనుల పేరుతో లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి చేపట్టిన మాణిక్‌గూడ కుడికాలువ మరమ్మతు పనులు తక్కువ వర్షానికే దెబ్బతినడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కాలువకు వేసిన మట్టి వర్షపు నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతోపాటు పక్కనే ఉన్న సీసీ రోడ్డు కూడా దెబ్బతినడంపై సీపీఎం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాధనంతో చేపట్టిన పనులు మన్నికగా ఉండాల్సి ఉండగా.. వర్షం పడగానే కొట్టుకుపోయే స్థాయిలో పనులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పనుల నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మాణిక్‌గూడ గ్రామంలో చేపట్టిన కుడికాలువ మరమ్మతు పనులను సీపీఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. కాలువ దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి అక్కడి పరిస్థితిని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు ప్రభుత్వం కేటాయించే ప్రజాధనం సక్రమంగా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అయితే మాణిక్‌గూడ కుడికాలువ పనుల పరిస్థితి చూస్తుంటే నాణ్యతా ప్రమాణాల అమలుపై అనేక సందేహాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు.

**వర్షం వస్తే.. పనుల నాణ్యత బయటపడిందా?**

కుడికాలువకు చేపట్టిన మరమ్మతుల్లో భాగంగా వేసిన మట్టి తక్కువ వర్షానికే కొట్టుకుపోయిందని సీపీఎం నాయకులు తెలిపారు. కాలువ పక్కనున్న సీసీ రోడ్డు సైతం దెబ్బతిన్నదన్నారు. భారీ వర్షాలు కురవకముందే కాలువ పరిస్థితి ఇలా ఉంటే.. రానున్న రోజుల్లో వర్షాలు మరింత పెరిగితే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు.పనులు చేపట్టే సమయంలో ఉపయోగించే నిర్మాణ సామగ్రి, మట్టి నాణ్యతను పరిశీలించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందని తెలిపారు. పనులు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించారా? నిబంధనల ప్రకారం పనులు జరిగాయా? పనుల నాణ్యతను పరీక్షించారా? అనే అంశాలపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

**లక్షలు ఖర్చు.. ఫలితం శూన్యం?**

ప్రజల పన్నుల రూపంలో సమకూరిన నిధులను ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులకు కేటాయిస్తుందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఆ నిధులతో చేపట్టిన పనులు దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని అన్నారు. కానీ మాణిక్‌గూడ కుడికాలువ పనులు కొద్దికాలానికే దెబ్బతింటే మళ్లీ మరమ్మతులకు నిధులు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు.ఒకసారి చేసిన పనికి మళ్లీ ప్రభుత్వ నిధులు వెచ్చించాల్సి వస్తే ప్రజాధనం రెండుసార్లు ఖర్చవుతుందని అన్నారు. నాణ్యత లేని పనులను అడ్డుకోకపోతే ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతుందని విమర్శించారు.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి పనిని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సి ఉంటుందని సీపీఎం నాయకులు తెలిపారు. పనుల నాణ్యతలో లోపాలు ఉంటే వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి సరిచేయాల్సి ఉందన్నారు.అయితే కుడికాలువ పనులు దెబ్బతిన్న తర్వాతే సమస్య వెలుగులోకి రావడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోందన్నారు. పనులు జరుగుతున్న సమయంలో అధికారులు ఏం పరిశీలించారు? నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే ఎందుకు అడ్డుకోలేదు? అని ప్రశ్నించారు.పనుల అంచనా నుంచి ప్రారంభించి కొలతలు, నాణ్యతా పరీక్షలు, బిల్లుల చెల్లింపుల వరకు ప్రతి అంశాన్ని విచారణలో పరిశీలించాలని డిమాండ్ చేశారు.

**గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు**

కుడికాలువ దెబ్బతినడంతో మాణిక్‌గూడ గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకులు తెలిపారు. కాలువ ప్రాంతంలో మట్టి కొట్టుకుపోవడంతో మార్గం ప్రమాదకరంగా మారిందన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఈ ప్రాంతం గుండా వెళ్లేటప్పుడు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.వర్షాలు మరింతగా కురిస్తే కాలువ మరింత కోతకు గురయ్యే అవకాశం ఉందని, దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడవచ్చని హెచ్చరించారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

**తాత్కాలిక మరమ్మతులు వద్దు**

కాలువ దెబ్బతిన్న ప్రాంతంలో మళ్లీ మట్టి పోసి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించడం వల్ల ప్రయోజనం ఉండదని సీపీఎం నాయకులు అన్నారు. గతంలో ఎదురైన సమస్య పునరావృతం కాకుండా వర్షపు నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా శాశ్వత నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.కాలువ నిర్మాణంలో సాంకేతిక ప్రమాణాలను పాటించాలని, అవసరమైన చోట పటిష్ఠమైన నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.





**సమగ్ర విచారణకు డిమాండ్**

మాణిక్‌గూడ కుడికాలువ మరమ్మతు పనులపై జిల్లా స్థాయిలో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పనులకు మంజూరైన నిధులు, అంచనాలు, పనుల అమలు, వినియోగించిన మట్టి, నిర్మాణ సామగ్రి, కొలతలు, నాణ్యతా ప్రమాణాలు, బిల్లుల చెల్లింపులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కోరారు.విచారణలో నాణ్యతా లోపాలు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా కఠినమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

**కలెక్టర్ స్పందించాలి**

మాణిక్‌గూడ కుడికాలువ సమస్యపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని సీపీఎం నాయకులు కోరారు. కలెక్టర్ స్వయంగా గ్రామాన్ని సందర్శించి కుడికాలువ పరిస్థితిని పరిశీలించాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజలకు ఉపయోగపడాల్సిన అభివృద్ధి పనులు ప్రజలకే ఇబ్బందులు కలిగించే పరిస్థితి రాకూడదని అన్నారు. తాత్కాలిక చర్యలతో సమస్యను పక్కన పెట్టకుండా నాణ్యతతో శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, పనుల్లో నాణ్యత లోపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిసెల కార్తీక్, రాజేందర్, అశోక్, నాయకులు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో మత సామరస్యాన్ని కాపాడాలి

**శాంతియుత గణేష్ ఉత్సవాలే లక్ష్యం..**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఏసీపీ వెంకటేశ్వర్లు**

**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను మతాలకు అతీతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. చెన్నూర్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మార్వాడి భవన్‌లో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు ముందుగానే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి సంబంధించి అమల్లో ఉన్న నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా మత



సామరస్యానికి ఎలాంటి భంగం కలగకుండా అన్ని వర్గాల ప్రజలు సమన్వయంతో వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వాటిని స్వయంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయకుండా వెంటనే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలని, పోలీసుల సహకారంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఏసీపీ సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించే శాంతి యాత్రలో శాంతిభద్రతల పరిరక్షణకు యువత, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. నిబంధనల ప్రకారం



క్రమసంఖ్యను పాటిస్తూ నిమజ్జన ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏసీపీ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సీఐ బన్సీలాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్మన్ వినయ్ కుమార్, కౌన్సిలర్లు అజీమ్, సంతోష్, కో-ఆప్షన్ సభ్యులు సాధనబోయిన కృష్ణ, కాంగ్రెస్ నాయకులు పెద్దింటి శ్రీనివాస్, బ్రహ్మయ్య, శాంతి కమిటీ నాయకులు బి. జనార్ధన్ రావు, బొల్లంపల్లి లక్ష్మీరాజ గౌడ్, పట్టణంలోని వివిధ కుల సంఘాల నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మీడియానే బెదిరిస్తారా.. ప్రైవేట్ క్లినిక్ వైద్యుడు?

## నేను ఎస్సై, సర్పంచ్‌కు చెప్పే వైద్యం చేస్తున్నా.. మీరేం రాస్తారో రాయండి..నేను చూసుకుంటా” అంటూ వ్యాఖ్యలు?

## ప్రశ్నలు అడిగితే సమాధానం చెప్పాల్సింది పోయి.. అవహేళన, సవాల్ ధోరణి ఎందుకు?

## క్లినిక్ నిర్వహణపై వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు చేయాలంటున్న స్థానికులు

**ఆసిఫాబాద్ అర్బీ, సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి):**ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని ఓ గ్రామపంచాయతీ పరిధిలో ప్రైవేట్ క్లినిక్ నిర్వహిస్తున్న ఓ వైద్యుడి వ్యవహారశైలి ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. క్లినిక్‌లో అందిస్తున్న వైద్య సేవలు, వైద్యుడి అర్హతలు, క్లినిక్ నిర్వహణకు సంబంధించిన అంశాలపై మీడియా ప్రతినిధులు సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేయగా, సదరు వైద్యుడు దురుసుగా స్పందించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీడియా ప్రతినిధులను ఉద్దేశించి నేను ఎస్సై, సర్పంచ్‌కు చెప్పి వైద్యం చేస్తున్నాను.. మీరేం రాస్తారో రాయండి.. నేను చూసుకుంటాను అనే తరహాలో వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు నిజమైతే మీడియా ప్రతినిధులను ఉద్దేశించి ఈ విధంగా మాట్లాడటం వెనుక ఉద్దేశం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన సమయంలో.. సవాల్ ఎందుకు?**

ప్రజలకు సంబంధించిన అంశాలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నలు అడగడం సాధారణమే. ముఖ్యంగా వైద్య సేవలకు సంబంధించిన విషయాల్లో ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత వ్యక్తులపై ఉంటుంది. క్లినిక్ నిబంధనల ప్రకారమే కొనసాగుతుంటే, వైద్యుడికి అవసరమైన అర్హతలు, రిజిస్ట్రేషన్, అనుమతులు ఉన్నట్లయితే వాటి వివరాలను వెల్లడించడం ద్వారా అనుమానాలకు తెరదించవచ్చు. అయితే ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా “మీరేం రాస్తారో రాయండి.. నేను చూసుకుంటాను” అనే తరహా వ్యాఖ్యలు చేయడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఎస్సై, సర్పంచ్‌కు చెప్పాను” అంటే సరిపోతుందా?**


తాను పోలీస్ అధికారికి, గ్రామ సర్పంచ్‌కు చెప్పి వైద్యం చేస్తున్నానని సదరు వైద్యుడు పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఏ వ్యక్తి అయినా వైద్య సేవలు అందించేందుకు సంబంధిత చట్టపరమైన అర్హతలు, రిజిస్ట్రేషన్, వర్తించే అనుమతులు వంటి అంశాలు కీలకంగా ఉంటాయి. పోలీస్ అధికారి లేదా గ్రామ ప్రజాప్రతినిధికి సమాచారం ఇవ్వడం మాత్రమే వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అర్హతలకు ప్రత్యామ్నాయం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల ఈ అంశంపై సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరం**

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలతో పాటు ప్రైవేట్ క్లినిక్‌లు కూడా అందుబాటులో ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని క్లినిక్‌లను ఆశ్రయించే ప్రజలు పెద్ద సంఖ్యలో ఉంటారు. అలాంటి పరిస్థితుల్లో క్లినిక్‌ల నిర్వహణ, వైద్యుల అర్హతలు, రిజిస్ట్రేషన్, రోగులకు అందుతున్న సేవలు తదితర అంశాలపై సంబంధిత శాఖ పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సరైన సమాచారం లేక ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

**మందుల విషయంలోనూ స్పష్టత అవసరం**

ప్రైవేట్ క్లినిక్‌లలో రోగులకు మందులు సూచించడం, అందించడం వంటి అంశాలు కూడా నిబంధనలకు లోబడి ఉండాలి. రోగులకు ఏ రకమైన చికిత్స అందిస్తున్నారు? మందుల వినియోగం ఎలా ఉంది? రోగులకు అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వ ఆసుపత్రులకు లేదా నిపుణుల వద్దకు రిఫర్ చేస్తున్నారా? వంటి అంశాలను కూడా సంబంధిత అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. ఇవి అన్నీ ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశాలే కావడంతో కేవలం ఆరోపణలు, ప్రత్యారోపణల స్థాయిలో కాకుండా అధికారికంగా తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.




**మీడియాపై అవహేళన వ్యాఖ్యలు ఎందుకు?**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత. అదే సమయంలో ఒక వ్యక్తి లేదా సంస్థపై వార్త ప్రచురించే ముందు సంబంధిత వ్యక్తి వివరణను తీసుకోవడం కూడా జర్నలిస్టుల బాధ్యత. అయితే మీడియా ప్రతినిధులు ప్రశ్నలు అడిగినప్పుడు వారిపై అవహేళనగా మాట్లాడటం లేదా బెదిరింపు ధోరణిలో స్పందించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా వార్తలో వాస్తవాలు తప్పుగా ఉంటే సంబంధిత వ్యక్తి తన వివరణను మీడియాకు ఇవ్వవచ్చు. అవసరమైతే చట్టపరమైన మార్గాలను కూడా ఆశ్రయించవచ్చు.కానీ రాసుకోండి.. నేను చూసుకుంటాను అనే ధోరణిలో స్పందించడం వల్ల అసలు సమస్య పక్కదారి పట్టే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**అధికారుల పేర్లను ప్రస్తావించడం చర్చనీయాంశం**

ఎస్సైకి, సర్పంచ్‌కు చెప్పి వైద్యం చేస్తున్నాను అని చెప్పినట్లు వస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు మరో చర్చకు దారితీశాయి. నిజంగానే పోలీస్ అధికారి, సర్పంచ్‌కు క్లినిక్ నిర్వహణ గురించి సమాచారం ఇచ్చారా? ఇచ్చి ఉంటే ఏ సందర్భంలో సమాచారం ఇచ్చారు? క్లినిక్ నిర్వహణకు సంబంధించిన పత్రాలను వారు పరిశీలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇస్తే అనవసరమైన అనుమానాలకు తావుండదని స్థానికులు అంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించాలి ఈ నేపథ్యంలో సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సదరు క్లినిక్‌పై నిబంధనల ప్రకారం తనిఖీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. క్లినిక్ నిర్వహిస్తున్న వ్యక్తి వైద్య అర్హతలు, రిజిస్ట్రేషన్, వర్తించే అనుమతులు, అక్కడ అందిస్తున్న వైద్య సేవలు తదితర అంశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే మీడియా ప్రతినిధులతో జరిగినట్లు చెబుతున్న వ్యాఖ్యలపై కూడా వాస్తవాలను తెలుసుకుని, ఏదైనా తప్పుదోవ పట్టించే పరిస్థితి ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే వైద్యం అనేది నేరుగా ప్రజల ప్రాణాలు, ఆరోగ్యంతో ముడిపడిన సేవ. అందువల్ల ఈ రంగంలో పారదర్శకత, బాధ్యత, నిబంధనల పాటింపు అత్యంత ముఖ్యమైనవి. క్లినిక్ సక్రమంగా నడుస్తుంటే ఎలాంటి అనుమానాలకు తావులేదని, అధికారులు తనిఖీ చేసి అన్నీ నిబంధనల ప్రకారమే ఉన్నాయని తేల్చితే సమస్య అక్కడితో ముగుస్తుందని స్థానికులు అంటున్నారు. అదే సమయంలో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు ఉంటే వాటిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.

**బెదిరింపులతో వార్తలు ఆగవు.. వాస్తవాలు బయటకు రావాల్సిందే**

ప్రజా సమస్యలను ప్రశ్నించే మీడియా ప్రతినిధులను బెదిరించడం ద్వారా సమస్యలను పరిష్కరించలేరని జర్నలిస్టు వర్గాలు పేర్కొంటున్నాయి. మీడియా కూడా వ్యక్తిగత వైరం లేకుండా ఆధారాలు, అధికారిక సమాచారం, సంబంధిత వ్యక్తుల వివరణ ఆధారంగా వార్తలను ప్రచురించాల్సిన అవసరం ఉంది. ఈ ఘటనలో కూడా ఆరోపణలు నిజమా? కాదా? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. అయితే మీడియా ప్రతినిధులను ఉద్దేశించి బెదిరింపు ధోరణిలో వ్యాఖ్యలు చేసినట్లు వస్తున్న ఆరోపణలు మాత్రం చర్చకు దారితీశాయి.వైద్యం చేస్తున్నాం.. నిబంధనలు పాటిస్తున్నాం అని చెప్పడం ఒకవైపు.. మీరేం రాస్తారో రాయండి.. నేను చూసుకుంటాను అంటూ మీడియాకు సవాల్ చేయడం మరోవైపు ఉండటంతో అసలు క్లినిక్ నిర్వహణ వెనుక ఉన్న వాస్తవాలేమిటన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. అధికారుల తనిఖీతోనే తేలనున్న వాస్తవాలు ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి, క్లినిక్ నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. మరి అధికారులు స్పందిస్తారా? క్లినిక్‌పై తనిఖీ నిర్వహిస్తారా? మీడియాను ఉద్దేశించి చేసినట్లు చెబుతున్న వ్యాఖ్యలపై వివరణ తీసుకుంటారా? అన్నది వేచి చూడాల్సిందే.

# జర్నలిస్టును భయభ్రాంతులకు గురిచేస్తున్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు?

ప్రజా సమస్యలపై వార్తలు రాస్తే ఎందుకింత ఆగ్రహం?
ప్రశ్నిస్తే ఒత్తిళ్లు.. నిజాలు వెలుగులోకి తెస్తే బెదిరింపుల ఆరోపణలు
మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని కొన్ని గ్రామపంచాయతీలకు చెందిన పాలకులు ఓ జర్నలిస్టును కొందరు సర్పంచ్‌లు, వార్డు సభ్యులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పంచాయతీ పరిపాలనలోని లోపాలు, అభివృద్ధి పనుల పరిస్థితి, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను వార్తల ద్వారా ప్రజల ముందుకు తీసుకువస్తున్న జర్నలిస్టుపై కొందరు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం స్థానికంగా జరుగుతోంది.ప్రజలకు సంబంధించిన సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా విధి. సమస్యలను ప్రశ్నించడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేయడం జర్నలిస్టుల వృత్తిపరమైన బాధ్యత. అయితే ఈ బాధ్యతను నిర్వర్తిస్తున్న సమయంలో జర్నలిస్టుపై వ్యక్తిగతంగా ఒత్తిడి తీసుకురావడం, భయపెట్టేలా వ్యవహరించడం, వార్తలు రాయకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు రావడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజా సమస్యలపై రాస్తే.. వ్యక్తిగత కక్ష ఎందుకు?

గ్రామాల్లో సమస్యలు అనేకం ఉంటాయి. ప్రజలకు తాగునీరు అందకపోవచ్చు.. రోడ్లు దెబ్బతిని ఉండవచ్చు.. డ్రైనేజీ సమస్య ఉండవచ్చు.. వీధిలైట్లు పనిచేయకపోవచ్చు.. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందకపోవచ్చు.. అభివృద్ధి పనులు నత్తనడకన సాగవచ్చు. ఇలాంటి సమస్యలను ప్రజలు మీడియా దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటిని వార్తలుగా ప్రచురించడం సహజమే. అయితే సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యతను పక్కనబెట్టి, ఆ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన జర్నలిస్టుపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వార్తలో వాస్తవం లేదని భావిస్తే సంబంధిత ప్రజాప్రతినిధులు తమ వివరణను ఇవ్వవచ్చు. ఆధారాలతో ఖండించవచ్చు. కానీ జర్నలిస్టును భయపెట్టే వాతావరణం సృష్టించడం మాత్రం సరైన పద్ధతి కాదని పలువురు అంటున్నారు.

### వార్త ఎందుకు రాశారు?' అంటూ ప్రశ్నలు?

జర్నలిస్టుపై కొందరు ప్రజాప్రతినిధులు నేరుగా లేదా పరోక్షంగా ఒత్తిడి తీసుకువస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఎందుకు రాశారు?, ఎవరు చెప్పి రాశారు? మా గ్రామం గురించి ఎందుకు వార్తలు ఇస్తున్నారు?" అంటూ ప్రశ్నిస్తున్నారనే చర్చ సాగుతోంది.వార్తపై అభ్యంతరం ఉంటే దానిపై స్పందించడం ప్రజాప్రతినిధుల హక్కు. కానీ జర్నలిస్టు వృత్తినే ప్రశ్నించడం, వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం, భయపెట్టేలా మాట్లాడటం వంటి చర్యలు జరిగితే అది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన సమస్యగా కాకుండా మీడియా స్వేచ్ఛకు సంబంధించిన అంశంగా మారుతుందని పలువురు పేర్కొంటున్నారు.

### ప్రజలకు తెలియాల్సిన విషయాలను ఎవరు చెబుతారు?

మారుమూల గ్రామాల్లో అధికారులు ప్రతిరోజూ పర్యటించడం సాధ్యం కాదు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అధికారుల దృష్టికి చేరకముందే స్థానిక మీడియా ద్వారా వెలుగులోకి వస్తుంటాయి. స్థానిక జర్నలిస్టులు గ్రామాల్లో తిరుగుతూ సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తుంటారు. అలాంటి సమయంలో జర్నలిస్టులపై ఒత్తిళ్లు పెరిగితే భవిష్యత్తులో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి వారు వెనకడుగు వేసే పరిస్థితి ఏర్పడవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఫలితంగా సమస్యలు పరిష్కారం కాకుండా మరింత కాలం కొనసాగుతాయని ప్రజలు అంటున్నారు. సర్పంచ్ పదవి అంటే అధికారం కాదు.. బాధ్యత గ్రామ ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌కు గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాల్లో కీలక బాధ్యత ఉంటుంది. అదే విధంగా వార్డు సభ్యులు తమ వార్డులోని ప్రజల సమస్యలను పంచాయతీ దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రజలు ఎన్నుకున్న పదవి ప్రజలకు సేవ చేయడానికి ఉపయోగపడాలి తప్ప, ప్రశ్నించే వారిని భయపెట్టడానికి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజాప్రతినిధుల పనితీరుపై మీడియా ప్రశ్నిస్తే దానికి సమాధానం ఇవ్వడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుకోవచ్చు.

### వార్త తప్పయితే.. వివరణ ఇవ్వొచ్చు కదా?

ఒక వార్తలో వాస్తవాలు తప్పుగా ఉన్నాయని ఎవరైనా భావిస్తే సంబంధిత జర్నలిస్టుకు తమ వివరణ ఇవ్వవచ్చు. పత్రికా సంస్థకు ఖండన పంపవచ్చు. అవసరమైతే చట్టబద్ధమైన మార్గాలను కూడా అనుసరించవచ్చు. ఇది ప్రజాస్వామ్య పద్ధతి. అంతేకానీ వార్త రాయకుండా ఒత్తిడి చేయడం, జర్నలిస్టును వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం లేదా భయపెట్టే పరిస్థితులు సృష్టించడం సమస్యను పరిష్కరించదు. పైగా ఇలాంటి ఘటనలు బయటకు వస్తే ప్రజల్లో ప్రజాప్రతినిధుల తీరుపై అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

### జర్నలిస్టు ఒక్కడే కాదు.. వెనుక ప్రజల గొంతు ఉంది

ఒక జర్నలిస్టు రాసే ప్రతి వార్త వెనుక ఏదో ఒక ప్రజా సమస్య ఉండొచ్చు. ఒక గ్రామంలో రోడ్డు సమస్య ఉంటే ఆ రోడ్డుపై ప్రయాణించే వందలాది మంది ప్రజల సమస్య అది. తాగునీటి సమస్య ఉంటే ఆ నీటి కోసం ఎదురుచూసే కుటుంబాల సమస్య అది. ప్రభుత్వ పథకం అందకపోతే అర్హత ఉన్న లబ్ధిదారుడి సమస్య అది. కాబట్టి ప్రజా సమస్యను వార్తగా ప్రచురించిన జర్నలిస్టును వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం ద్వారా అసలు సమస్య పక్కదారి పట్టే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. మీడియా–– ప్రజాప్రతినిధుల మధ్య ఆరోగ్యకరమైన సంబంధం అవసరం గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా మధ్య సమన్వయం ఎంతో అవసరం. ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం కావాలంటే ఈ మూడు వర్గాలు పరస్పరం సహకరించుకోవాలి. ప్రజాప్రతినిధులు మీడియాను శత్రువుగా చూడకుండా ప్రజల సమస్యలను తెలియజేసే వేదికగా చూడాలి. అదే సమయంలో జర్నలిస్టులు కూడా వార్తలను ప్రచురించే ముందు సంబంధిత వ్యక్తుల వివరణ తీసుకోవడం, వాస్తవాలను ధృవీకరించడం వంటి




జర్నలిస్టిక్ ప్రమాణాలను పాటించాలి. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి జర్నలిస్టుపై ఒత్తిళ్లు, భయపెట్టే చర్యలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు వాస్తవం కాకపోతే పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేయాలని వారు అంటున్నారు. జర్నలిస్టులు తమ వృత్తిపరమైన విధులను స్వేచ్ఛగా నిర్వహించేందుకు అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు రక్షణ ఉండటం ప్రజలకే మేలు చేస్తుందని చెబుతున్నారు.

### ప్రశ్నించే గొంతును' భయపెట్టడం కాదు.. సమాధానం చెప్పాలి

ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. మీడియా అడిగే ప్రశ్నలు కూడా చివరికి ప్రజల ప్రశ్నలే. ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ద్వారా ప్రజల్లో మరింత నమ్మకం పెరుగుతుంది.

### వార్త నచ్చకపోతే వివరణ ఇవ్వాలి..

వాస్తవం కాదంటే ఆధారాలతో ఖండించాలి.. కానీ జర్నలిస్టును భయపెట్టడం మాత్రం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఏ విధంగా స్పందిస్తారు? జర్నలిస్టుపై ఒత్తిళ్లు తెస్తున్నారనే ఆరోపణలపై విచారణ చేపడతారా? అనే అంశాలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. ఆరోపణలు నిజమైతే వెంటనే చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రజల కోసం రాసే కలానికి రక్షణ అవసరం

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే ప్రతి జర్నలిస్టుకు స్వేచ్ఛగా పనిచేసే హక్కు, భద్రత అవసరం. సమస్యలను దాచిపెట్టడం వల్ల గ్రామాభివృద్ధి జరగదు. సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కరించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుంది. అందుకే జర్నలిస్టును భయపెట్టడం కాదు.. అతను లేవనెత్తిన సమస్యకు పరిష్కారం చూపాలి. ప్రశ్నించే గొంతును అణచడం కాదు.. ఆ ప్రశ్నకు ప్రజల ముందే సమాధానం చెప్పాలి.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమా...?

కుప్టి హైవే సమస్యపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆగ్రహం

**నేరడిగొండ, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండలం లోని కుప్టి వద్ద జాతీయ రహదారి ( ఎన్ హెచ్ -44)పై నెలకొన్న సమస్యలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం పరిశీలిం చారు. హైవేపై ఏర్పడిన గుంతలు, బ్రిడ్జిపై చేపట్టిన సింగిల్‌వే కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన పరిశీలించి, హైవే అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన ఎన్ హెచ్ -44పై ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాంటి జాతీయ రహదారిపై కుప్టి వద్ద గుంతలు ఏర్పడి రోజుల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమ న్నారు. అదేవిధంగా బ్రిడ్జిపై సింగిల్‌వే కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాల కంటే తనకు ఏదీ ముఖ్యంకాదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. హైవే సమస్యపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారంపై స్పష్టమైన సమాధానం ఇవ్వకపోయినా, పనులు పూర్తి చేయడంలో జాప్యం చేసినా ప్రజలతో కలిసి హైవే దిగ్బంధం చేపడతానని ఆయన హెచ్చరించారు.



# అంతర్రాష్ట్ర పశువుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

**ఆరుగురు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**

**--47 పశువులు, లారీ, గంజాయి స్వాధీనం..**

**మరో ముగ్గురి కోసం గాలింపు**

**నేరడిగొండ సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి):** రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపైకి వాహనాలను ఉద్దేశపూర్వకంగా ఎక్కించి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో అంతర్రాష్ట్ర పశువుల అక్రమ రవాణా ముఠాకు చెందిన ఆరుగురు నిందితులను నేరడిగొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 47 పశువులు, కంటైనర్ లారీ, 4 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్ వెల్లడించారు.

**ఘటన నేపథ్యం:**

సెప్టెంబర్ 1న ఉదయం నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద టోల్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా, నేరడిగొండ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న మహీంద్రా బొలెరో ఎస్ యు వి ( ఎం హెచ్ 34 సీడీ 5318)ను నిలిపేందుకు యత్నించారు. అయితే నిందితులు వాహనాన్ని ఆపకుండా టోల్ గేట్లను ఢీకొడుతూ వేగంగా దూసుకెళ్లారు. వెనుకనే వస్తున్న కంటైనర్ లారీ ( ఎం హెచ్ 40 సీఎం 2712) కూడా సైన్ బోర్డులు, డివైడర్లను ఢీకొట్టి పరారైంది.

**పైలెట్ వాహనంగా బొలెరో..**

నిందితులు ముఠాగా ఏర్పడి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పశువుల లారీకి ముందు బొలెరో వాహనాన్ని పైలెట్‌గా ఉపయోగిస్తూ, మార్గమధ్యంలో పోలీసుల తనిఖీల సమాచారాన్ని లారీ డ్రైవర్‌కు చేరవేస్తున్నట్లు గుర్తించారు.

**పోలీసుల వేగవంతమైన చర్యలు:**

సెప్టెంబర్ 3న తెల్లవారుజామున కుంటాల గ్రామ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి సమాచారంతో ఆదిలాబాద్‌లో ఉన్న మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు.

**అరెస్టయిన వారు:** ఎండి. షఫీ ముదస్సిర్ (ఆదిలాబాద్), ఫిర్దోస్ బెగ్, మహమ్మద్ హైదర్ అలీ, క్షితిజ్ భీమ్‌రావు సేవట్కర్ (నాగ్‌పూర్), గోపాల్ సింగ్ షెకావత్ (ఆదిలాబాద్), సందీప్ విఠల్ ముప్పిడివార్ (యవత్మాల్).

**పరారీలో ఉన్నవారు:** మహమ్మద్ మజార్, రాజు, రవి జగదీష్ బాగ్డేల్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు:**

నిందితుల నుంచి 24 ఎద్దులు, 23 ఆవులు (మొత్తం 47) స్వాధీనం చేసుకున్నారు. రవాణాలో 3 పశువులు మృతి చెందగా, మిగిలిన 44 పశువులను గోశాలకు తరలించారు. వీరితో పాటు కంటైనర్, గంజాయి, ఫోన్లను సీజ్ చేశారు.




**కేసు నమోదు - రిమాండ్:**

టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ యెంపల్లి రామయ్య ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 259/2026 కింద తొమ్మిది మందిపై బి ఎం ఎస్ జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం, గోవధ నిరోధక చట్టం, ఎన్ డి పి ఎస్ చట్టాల కింద కేసులు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన ఆరుగురిని బోథ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం









**బీఆర్ఎస్ శ్రేణుల నిరసన.**

**420 హామీలపై ప్రభుత్వాన్ని నిలదీత**

**బాసర, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)** అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. శుక్రవారం బాసర మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలకు చేయూత కింద నెలకు రూ.4,000, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హామీలను అమలు చేసిన తర్వాతే సంబరాలు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, విలాస్ గాధేవార్, లోలం శ్యామ్‌సుందర్, బాసర మండల అధ్యక్షుడు కొర్వా శ్యామ్, మండల సీనియర్ నాయకులు నుకం రామారావు, గంగారావు, లాల్మియా, మొఇజ్, రవి, శ్రీకాంత్, శ్రీనివాస్, కుబీర్, కుంటాల, లోకేశ్వరం మండల అధ్యక్షులు ఎన్నిల అనిల్, దత్తాత్రి, కొర్వే శ్యామ్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

**సెప్టెంబర్ 04,(ప్రజా జ్యోతి):** ఇచ్చోడ మండల కేంద్రము లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు చిన్ని కృష్ణుని వేషధారణ లో బాలురు,గోపికల వేషధాణలతో బాలికలు ఆకట్టుకున్నారు.పుర వీధుల గుండా శ్రీ కృష్ణుని భజనలు, కీర్తనలతో చిన్నారులతో శోభాయాత్ర నిర్వహించారు.శివాజీ చౌక్,విఠల్ రుక్మిణీ మందిర్ మరియు పాఠశాల లో ఉట్లు కొట్టించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, ఆధ్యాత్మిక వేత్త శ్రీ బొడ్డు భోజన్న ముఖ్య వక్తగా పాల్గొని పోషకులకు,విద్యార్థులకు జన్మాష్టమి విశిష్టతను వివరించారు.భగవద్గీత లో శ్రీ కృష్ణుడు బోధించిన ఉపదేశాన్ని మానవ జీవితానికి అన్వయించుకొని జీవిత పరమార్థాన్ని తెలుసుకొని మంచి మార్గంలో నడవాలని అన్నారు. అనంతరం విద్యార్థులు గోపికలు కృష్ణుని వేషధాణలతో చేసిన నృత్యాలు, ప్రదర్శనలు అలరించాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు దేవర్ల సంతోష్,ఉత్తర్వార్ రాజేందర్ కమిటీ సభ్యులు సుదర్శన్,వట్ పట్వార్ సంతోష్,ఎబ్వీపీ,నాదీఫూ నాయకులు పిల్లి నరేష్,నాగేందర్ ప్రధాన ఆచార్యులు సంతోష్ కుమార్ ఆచార్యులు ఉషారాణి, భారతి, మంజుల,సుజాత, సింధుజ,శంకర్ పోషకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి.

**వంటా వార్పుతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నిరసన**

**సెప్టెంబర్ 04,(ప్రజా జ్యోతి :)**ఇచ్చోడ కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో ఇచ్చోడ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. అనంతరం సబ్‌స్టేషన్ ఎదుట వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మోటర్లకు మీటర్లు పెడితే రైతులకు మిగిలేది ఉరే అంటూ రైతులతో కలిసి ఉరి తాళ్లతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతులను కరెంట్ కోతలతో ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.



విద్యుత్ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా, రైతుబంధు, రైతుబీమా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు.

# 130 గ్రాముల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

## బల్లార్షా నుంచి రెబ్బెనకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి** బల్లార్షా నుంచి గంజాయిని కొనుగోలు చేసి రెబ్బెనకు తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 130 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 3న రెబ్బెన బస్టాండ్ వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోయేందుకు ప్రయత్నించిన ఇద్దరిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులను జక్కులపల్లి గ్రామానికి చెందిన ధాగం సందీప్ (24), మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన కొండగుర్ల రాజేందర్ ప్రసాద్ (19)గా గుర్తించారు. సందీప్ వద్ద ఉన్న నల్లటి పాలిథిన్ కవర్‌ను తనిఖీ చేయగా 130 గ్రాముల గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.7 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయితో పాటు మోటరోలా మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వీరిద్దరూ



జక్కులపల్లికి చెందిన దుర్గం అభినేష్ అలియాస్ చింటూతో కలిసి కాగజ్‌నగర్ నుంచి రైలులో బల్లార్షా వెళ్లి గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం దానిని రెబ్బెనకు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# నాలుగో డివిజన్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**ఆధ్యాత్మిక శోభతో అలరించిన శ్రీకృష్ణుని వేషధారణలు**

**ఉట్టికొట్టే కార్యక్రమంతో సందడిగా వేడుకలు**

**మంచిర్యాల, 4, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నాలుగో డివిజన్‌లో కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో నాలుగో డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో ముస్తాబై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల కృష్ణుడి వేషధారణలు, వారి చిలిపి చేష్టలు, భక్తిగీతాలతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. ధర్మాన్ని కాపాడేందుకు, అధర్మాన్ని అంతం చేసేందుకు శ్రీకృష్ణుడు అవతరించాడని, భగవద్గీత ద్వారా మానవాళికి కర్తవ్యబోధ, ధర్మబోధ చేశారని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి జీవితం ప్రేమ, స్నేహం, ధైర్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుడి బోధనలను ఆదర్శంగా తీసుకుని



సత్యం, ధర్మం, మానవతా విలువలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఉట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్ ఉట్టి కార్యక్రమాన్ని ప్రారంభించగా, స్థానిక యువత, చిన్నారులు ఉట్టికొట్టేందుకు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కొట్టే సమయంలో ప్రజలు హర్షధ్వానాలు చేస్తూ కేరింతలు కొట్టడంతో కార్యక్రమ ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. మహిళలు, చిన్నారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వేడుకలు మరింత ఆహ్లాదకరంగా సాగాయి. భక్తి, ఆనందం, ఉత్సాహం కలగలిసిన వాతావరణంలో కృష్ణాష్టమి వేడుకలను స్థానికులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి ఆశీస్సులతో నాలుగో డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాల తో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం అభినందనీయమని అన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి..

**జెఏసి నాయకులు ఏ. నవీన్ కుమార్**



**ఆదిలాబాద్ టౌన్,సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి )**తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు మరియు కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని జెఏసి జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు ఏ. నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో (టీ ఎన్ జి ఓ) సంఘ భవనంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో, సెప్టెంబర్ 10న తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం, ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వడం మినహా ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని విమర్శించారు. నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగిన ప్రస్తుత తరుణంలో, ప్రతి 6 నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన కరవు భత్యం (డి ఎ )ను గత 3 సంవత్సరాలుగా పెండింగ్‌లో పెట్టడం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పాలిట మరణశాసనంగా మారిన సీపీఎస్ విధానాన్ని తాము అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని చెప్పి, మూడేళ్లు గడిచినా ఆ దిశగా కనీస ప్రస్తావన కూడా తీసుకురాకపోవడం హేయమని మండిపడ్డారు. అలాగే ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సన్నాహక సమావేశం లో టీజీవో అధ్యక్షులు కె.శివకుమార్, కిష్టన్న, కే. శంకర్ (టీ ఎస్‌యూటీఎఫ్), మూగ శ్రీనివాస్ (ఎస్‌టీయూ), ఎం. శ్రీనివాస్, బి. వృకోధర్ (టీపీటీఎఫ్), చంద్రశేఖర్ (టీఆర్టీఎఫ్), ఎండీ సర్దార్ అలీ (డ్రైవర్ అసోసియేషన్), శ్రీకాంత్, జలందర్ రెడ్డి (టీయూటీఎఫ్), ఎస్. సుదర్శన్ (టీటీయూ), లక్ష్మారెడ్డి, కే. రమేష్ (పెన్షనర్స్ అసోసియేషన్), జీహెచ్ఎం అసోసియేషన్, రమణాచారి (మెడికల్ ఫోరమ్) వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సోనాల మండల కేంద్రంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**సోనాల, సెప్టెంబర్ 4( ప్రజా జ్యోతి ):** సోనాల మండల కేంద్రంతో పాటు గుర్రాలతండ మరియు చుట్టుపక్కల తండాలలో మధుర లభన సమాజంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా ఆడవాళ్లు మగవాళ్ళు అందరూ కలిసి భక్తి శ్రద్ధలతో ఈరోజు ఉదయం నుంచి





ఉపవాసం ఆచరించి ఏమి తినకుండా ఉండి సాయంత్రం ఊరిలో నీ ఆడపడుచులందరూ సాయంత్రం వేళ అందరూ కలిసి చేనులకు వెళ్లి ఆటపాటలతో అక్కడ మట్టితో చేసినటువంటి శ్రీకృష్ణుని తయారుచేసి ఇంటికి తెచ్చి రాత్రి 12 గంటలకు కృష్ణుని పూజించిన తరువాత ఉపవాసాన్ని విరమిస్తారు.

## హంసవాయిని విద్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలు



బాసర, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి) బాసరలోని హంసవాయిని విద్యాలయంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాలలో కృష్ణాష్టమి విశిష్టతను వివరించి, విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఓంకార్ దేశాయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ సంత్ సేనా మహారాజ్ పుణ్యతిథి కి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఇచ్చోడ, సెప్టెంబర్ 4,(ప్రజా జ్యోతి ) ఈ నెల 8న ఇచ్చోడలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేనా మహారాజ్ పుణ్యతిథి నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ని కలిసి విన్నవించారు. సంఘ భవనంలో జరుపు కునే శ్రీ సంత్ సేన మహారాజ్ పుణ్య థితికి మండలం లోని నాయీ బ్రాహ్మణులు అందరూ హాజరు కావాలని కోరారు.

## ఇంటింటా శ్రీ కృష్ణాష్టమి పండగ

**రాధా కృష్ణ వేషాధారణలో పిల్లల అలంకరణ**



ఖానాపూర్ సెప్టెంబర్ 4( ప్రజా జ్యోతి ) గోకులష్టమి శ్రీకృష్ణుని పుట్టిన రోజుగా పిలవబడే కృష్ణాష్టమి వేడుకలు నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్లో ఘనంగా నిర్వహించారు ప్రతియట శ్రావణమాసంలో వచ్చే కృష్ణాష్టమి పండుగ రెండు రోజులుగా స్మార్తల వైష్ణవుల పండగలుగా రావడం ఆనవాయితి కాక ఈ ఏట అష్టమి రోహిణి నక్షత్రాలు ఏకకాలంలో రావడంతో ఒకే రోజు పండగ ఇంటింటా ఘనంగా శ్రీకృష్ణుని పుట్టినరోజు వేడుకలను అత్యంత వైభవంగా సాయంత్రం గోవులు (పశువులు) తమ ఇంటికి మరలే సమయంలో పుట్టాడన్న కృష్ణుని వేడుకను సందెవేళలోనే జరుపుకుంటారు ఈ మేరకు ఉదయాన్నే ఇంటిని శుభపరిచి రంగురంగుల రంగవల్లులు ఇంటి ముందర వేసి కృష్ణాష్టమి గోకులాష్టమి శుభాకాంక్షలు స్వాగతం పలికి చిన్నికృష్ణుని అడుగులను వేస్తారు అనంతరం భక్తిశ్రద్ధలతో కృష్ణుడికి ఇష్టమైన మొక్కజొన్న, దోసకాయ ఎల్కి పండు ఓమనకాయ పొట్లకాయ తో పాటు దద్దోజనం పులిహోర మధురమైన పిండి వంటలు తయారు చేసి నైవేద్యంగా ఇచ్చి సాయంత్రం కృష్ణుడు పుట్టాడన్న భవనతో పూట భోజనం చేస్తారు తమ చిన్న పిల్లలు పుట్టిన బిడ్డ నుండి పదేళ్ల వరకు ఆడ మగ తేడలతో రాధాకృష్ణులుగా పిల్లలకు అలంకరణ చేసి శ్రీకృష్ణుడే తమ తమ ఇంట్లో జన్మించాడు అన్న ఆనందాన్ని పొందుతారు

## ఆదివాసి సంక్షేమ పరిషత్ కమిటీ ఎన్నికలు విజయవంతం చేయండి



సోనాల, సెప్టెంబర్ 04 ( ప్రజాజ్యోతి ):సోనాల మండల కేంద్రంలో తేదీ 06/09/ 2026 నాడు ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీ ఆదేశాల మేరకు సోనాల మండలంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ కమిటీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుంది కావున మండలంలోని 9తెగల ఆదివాసి పటేల్ వ్యవస్థ, ఉద్యోగస్థులు, అలాగే ఆదివాసి యువత, ఆదివాసీ మేధావులు, ఆదివాసీ సర్పంచిలు, రాజకీయ నాయకులు, మండలం లోని ఆదివాసి గ్రామలా యువకులు ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆదివాసి పెద్దలు కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో సార్ మేడి తొడసం లక్ష్మణ్ గంగాధర్ ఆత్రం, బందు పటేల్, భూమన్న, ఈస్రు రాయి సిడం, మారుతీ జుగ్నక్,జాకు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపి ఎ స్**

**శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ**

**జిల్లా ప్రజలందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు**



ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 4, (ప్రజా జ్యోతి )శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వది నాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్ పట్టణం లోని ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న జిల్లా ఎస్పీకి ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో స్వాగతం పలికారు. అనంతరం శ్రీకృష్ణుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొందారు. పూజా కార్యక్రమాల్లో ప్రాణవానంద స్వామితో కలిసి జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన భజనలు, ప్రత్యేక ప్రార్థనలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తి భావంతో మార్మోగింది. శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు, భక్తి కార్యక్రమా లను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి శ్రీకృష్ణుని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, మా వల సీఐ బీడీ ప్రేమ్ కుమా ర్, ట్రాఫిక్ ఎస్ఐ ఆర్ దేవేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొదటి కౌన్సిలింగ్ లోనే ఎంబిబిఎస్ లో సీటు సంపాదించిన తుబా తరనుమ్




ఖానాపూర్ సెప్టెంబర్ 4( ప్రజా జ్యోతి ) ఖానాపూర్ పట్టణానికి చెందిన కుమారి తుబా తరనుమ్ నీటి పరీక్షల్లో 459 మార్కులు సంపాదించి మొదటి కౌన్సిలింగ్లోనే హైదరాబాద్లోని సాధన మెడికల్ కళాశాలలో సీట్ సంపాదించింది మైనార్టీ కి చెందిన తురాబుద్దీన్ మొదటి కూతురు సైతం ఎంబిబిఎస్ లో సీట్ సంపాదించి చదువు పూర్తి చేసుకోగా రెండో కుమార్తెకు సీట్ రావడం పట్ల విలేఖరిగా పనిచేస్తూనే కిరాణా కొట్టు నడుపుకుంటున్న తురాబుద్దీన్ ఇద్దరు కుమార్తెలు చదువులో ప్రతిభ చాటడం పట్ల పలువురు అభినందనలు తెలుపుతున్నారు

## బీఆర్ఎస్కు గుడ్‌బై...

**బీజేపీలోకి కందుల చాణక్య**

**కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పాయల శంకర్**



ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 4, (ప్రజా జ్యోతి )ఆదిలాబాద్ పట్టణంలో బీ ఆర్ఎస్ నుంచి బీజేపీ లోకి కందుల చాణక్య మణి కంఠ పాటు పలువురు సభ్యులు చేరారు.ఎమ్మెల్యే పాయల్ శంకర్ రెండేళ్ల పాలనను చూసి, ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కందుల చాణక్య తో పాటు పలువురు బీజేపీలో చేరారు.ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్ పోర్ట్ రావడం, పట్టణంలో మునుపెన్నడూ చూడని విధంగా ప్రధాన సమస్యలు పరిష్కారం అవుతుండటంతో ఆదిలా బాద్ యువత బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు.

## లక్ష్మణ చాంద మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు




లక్ష్మణ చాంద, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలో శుక్రవారం రోజున కృష్ణాష్టమి వేడుకలను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శ్రీమహావిష్ణువు అవతారాల లో అత్యంత విశిష్టమైన శ్రీ కృష్ణావతారాన్ని స్మరించుకునే పర్వదినమే కృష్ణాష్టమి. నేడు దేశవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. గోకులాష్టమి వేడుకలను నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబ య్యాయి. శ్రీకృష్ణుని జన్మ దినాన్ని పురస్కరించుకొని భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, శ్రీకృష్ణ జన్మ ఘటాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ప్రతి ఇళ్లలో చిన్నారును గోపిక, గోపాలుని వేషధారణలతో అలంకరించారు. గ్రామాలలో ఉట్టి కొట్టడం, కోలాటాలు భజనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

## ఘణంగాశ్రీకృష్ణ జన్మాష్టమి

**ఇస్కాన్ గుడిలో ప్రత్యేక పూజలు**

**పాల్గొన్నఎమ్మెల్యే పాయల్ శంకర్**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 4, (ప్రజా జ్యోతి)** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ లో ఇస్కాన్ ఆలయంలో భక్తుల సందర్శనార్థం భక్తులు అందరికి ఉల్లాస భరితమైన వాతావరణంలో ఈ ఒక్క మందిర ప్రాంగణమంతా అలంకరణతో ఇక్కడ ఆ యొక్క స్వామి వారిని దర్శనం చేసుకున్నప్పుడు కలిగే టటువంటి అనుభూతి మా మూలు అనుభూతి కాదు నిజంగా ఆదిలాబాద్ ప్రజలంతా చాలా అదృష్టవంతులు. ప్రభువు జీ ప్రత్యేకంగా ఆదిలాబాద్ ప్రజల కోసం ప్రత్యేకంగా ఈ ధార్మిక కార్యక్రమం నిర్వహించడం చాలా సంతో షమైన విషయం. ఈ సందర్భంగా ఆభగవంతుని ప్రార్థి స్తున్నాను అని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ ప్రజలకు ఎక్కడ ఏ కష్టాలు లేకుండా పాడి పంటల తో వర్షాలు, అదేవిధంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆదిలాబాద్ ప్రజ లందరు సుఖసంతో శాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు మనోజ్ పవర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా శ్రీ కృష్ణాష్టమి పండగ

**రాధా కృష్ణ వేషాధారణలో పిల్లల అలంకరణ**



**ఖానాపూర్ సెప్టెంబర్ 4( ప్రజా జ్యోతి )** గోకులష్టమి శ్రీకృష్ణుని పుట్టిన రోజుగా పిలవబడే కృష్ణాష్టమి వేడుకలు నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్‌లో ఘనంగా నిర్వహించారు ప్రతియట శ్రావణమాసంలో వచ్చే కృష్ణాష్టమి పండుగ రెండు రోజులుగా స్మార్తల వైష్ణవుల పండగలుగా రావడం ఆనవాయితి కాక ఈ ఏట అష్టమి రోహిణి నక్షత్రాలు ఏకకాలంలో రావడంతో ఒకే రోజు పండగ ఇంటింటా ఘనంగా శ్రీకృష్ణుని పుట్టినరోజు వేడుకలను అత్యంత వైభవంగా సాయంత్రం గోవులు (పశువులు) తమ ఇంటికి మరలే సమయంలో పుట్టాడన్న కృష్ణుని వేడుకను సందెవేళలోనే జరుపుకుంటారు ఈ మేరకు ఉదయాన్నే ఇంటిని శుభపరిచి రంగురంగుల రంగవల్లులు ఇంటి ముందర వేసి కృష్ణాష్టమి గోకులాష్టమి శుభాకాంక్షలు స్వాగతం పలికి చిన్నికృష్ణుని అడుగులను వేస్తారు అనంతరం భక్తిశ్రద్ధలతో కృష్ణుడికి ఇష్టమైన మొక్కజొన్న, దోసకాయ ఎల్కి పండు ఓమనకాయ పొట్లకాయ తో పాటు దద్దోజనం పులిహోర మధురమైన పిండి వంటలు తయారు చేసి నైవేద్యంగా ఇచ్చి సాయంత్రం కృష్ణుడు పుట్టాడన్న భవనతో పూట భోజనం చేస్తారు తమ చిన్న పిల్లలు పుట్టిన బిడ్డ నుండి పదేళ్ల వరకు ఆడ మగ తేడలతో రాధాకృష్ణులుగా పిల్లలకు అలంకరణ చేసి శ్రీకృష్ణుడే తమ తమ ఇంట్లో జన్మించాడు అన్న ఆనందాన్ని పొందుతారు

# నకిలీ పత్రాలతో స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నం

**నలుగురు అరెస్ట్ ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**

**స్థల యజమాని పత్రాలను దుర్వినియోగం చేసి**

**నకిలీ డాక్యుమెంట్ల సృష్టి**

**8 మందిపై మావల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు**

**ఒకే ప్లాటు పై మూడు రిజిస్ట్రేషన్లు అసలు యజమానిని డబ్బుల డిమాండ్**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 4, (ప్రజా జ్యోతి )**ఆదిలాబాద్ మావల పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ రెవెన్యూ పట్టా, గ్రామపం చాయతీ పన్ను రసీదులు, ఇతర పత్రాలను సృష్టించి, స్థలంపై భూ కబ్జా ప్రయత్నించిన కేసులో నలుగురు నిందితులను మావల పోలీసులు అరెస్ట్ చేయడం జరిగిందని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. మావల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 604/ 2026, సెక్షన్లు 420, 467, 468, 471 34 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఫిర్యాదుదారు పిట్ట లవాడ, దస్నాపూర్ ప్రాంతంలో ప్లాట్ నంబర్ 14, సర్వే నంబర్ 21/3లో 30ఐ50 అడుగుల స్థలం ఉంది. సదరు స్థలాన్ని రిజిస్టర్డ్ డాక్యు మెంట్ నంబర్ 3154/2022 ద్వారా కొనుగోలు చేసి, అప్పటి నుంచి స్వాధీనంలో ఉంచుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే నిందితుడు కాకడే నాందేవ్ తదితరులతో కలిసి సదరు స్థలానికి సంబంధించిన వివరాలు, ఇంటి ఫొటోలు, హద్దులు తదితరాలను దుర్వినియోగం చేస్తూ నకిలీ రెవెన్యూ పట్టా, గ్రామ పంచాయతీ పన్ను రసీదులు, ఇతర పత్రాలను సృష్టించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.ప్లాట్ నంబర్ 8కు సంబంధించిన వివరాలను దుర్వినియోగం చేసి డాక్యు మెంట్ నంబర్ 7888/2 023, అనంతరం 8240/2 024, 1278/2025 తదితర పత్రా ల ద్వారా స్థలంపై త ప్పుడు హక్కులు కల్పించు కునేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. అసలు స్థలం 30ఐ50 అడుగులు ఉండగా, నకిలీ పత్రాల్లో 30ఐ40 అడుగులుగా చూ పిస్తూ, అస లు స్థల హద్దులను ఉపయోగించినట్లు తేలింది.అదేవిధంగా ఫిర్యాదు దారుడిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసుదర్యాప్తులో భాగంగా నిందితులపై చట్టపర మైన చర్యలు చేపట్టారు.

**అరెస్ట్ అయిన నిందితులు:**

ఎ1) కాకడే నాందేవ్ ఏ నాందేవ్ కాకడే -- 41 సంవ త్సరాలు, టైలర్, కె ఆర్ కె కాలనీ, ఆదిలాబాద్. (04. 09.2026న అరెస్ట్), ఎ5) మేకల సూర్యకిరణ్ 30 సంవత్సరాలు, వ్యాపారం, రిక్షా కాలనీ, ఆదిలాబాద్. (04.09.2026న అరెస్ట్) ఎ6) షేక్ ముబారక్ 44 సంవత్సరాలు, వ్యాపారం, కె ఆర్ కె కాలనీ, ఆదిలాబాద్. (04.09. 2026న అరెస్ట్) ఎ7) సూరం శ్రీయం 30 సంవత్సరాలు, ప్రైవేట్ ఉ ద్యోగి, ఇందిరమ్మ కాలనీ, ఆదిలాబాద్. (04.09 .20 26న అరెస్ట్)

**పరారీలో ఉన్న నిందితులు**

ఎ2) అర్చన వాగ్మారే ఎ3) సంతోష్ కుమార్ ఎ ప్వర్,ఎ4) దేవకీ బాయి గట్టు,ఎ8) మేకల మల్లన్న పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. బాధితున్ని నిందితు లు నకిలీ పత్రాలను ఉపసంహరించుకోవడానికి లక్ష 1,60,000 డిమాండ్ చేయగా, బాధితులు 10000 రూపాయల ను చెల్లించడం జరిగింది అని తెలిపారు.నకిలీ పత్రాలు సృష్టించడం, ఇతరుల ఆస్తులపై అక్రమ హక్కులుకల్పిం చుకునేందుకు ప్రయత్నించ డం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలకు పాల్ప డితే కఠినమైన, చట్టపర మైన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి హెచ్చరించారు. ప్రజలు తమ ఆస్తులకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, ఇతర ధ్రువపత్రాలను భద్రంగా ఉంచుకోవాలని, అనుమానాస్పద లావాదేవీలు లేదా నకిలీ పత్రాల వ్యవహారాలు గుర్తించిన వెంటనే పోలీసులకు స మాచారం అందించాలని సూచించారు. మావల పోలీసుల ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు కొనసాగుతోంది.ఈ కార్యక్రమంలో మావల సీఐ బీడీ ప్రేమ్ కుమార్, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు







**బోథ్, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని నాగభూషణం, శిశు మందిర్, వేదం పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్ట మి వేడుకలను నిర్వహించారు. ముందుగా చిన్నారులు గోపిక గోపాలుడి వేషధారణ తో పాటుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు, కిషోర్ కుమార్, రాజేందర్ గౌడ్, పచ్చిపాల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి పండగ

**ఖానాపూర్ సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)** హైందవసంప్రదాయంలో ప్రత్యేకమైన హిందువులు జరుపుకునే పండగ శ్రీ కృష్ణాష్టమి (గోకులాష్టమి )సందర్భంగా ఖానాపూర్ లో నేడు ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపకు లు అల్లాడి వెంకటేశ్వర్లు అధ్యక్ష,కార్యదర్శులు మంత్రరాజం సురేష్,శెట్టి శ్యామ్మోహన్రావు ఒక ప్రకటనలో తెలిపారు ఈ పండగ ప్రతి ఏటా తెలంగాణ చౌక్ లో జరిగే ఉత్సవాన్ని ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి హిందూ బంధువులతో పాటు ఆయా గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సాయంత్రం ఏడు గంటలకు జరిగే కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు

## వెల్గనూర్‌లో వివేకానంద గ్రంథాలయం ప్రారంభం



**దండేపల్లి,సెప్టెంబర్04(ప్రజాజ్యోతి)** మండలంలోని వెల్గనూర్ గ్రామంలో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన స్వామి వివేకానంద గ్రంథాలయాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి గురువారం ప్రారంభించారు. గ్రామంలో బీజేపీ అభ్యర్థి మొరుపుటాల మానస-సంజీవ్‌ను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రంథాలయం నిర్మిస్తామని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ భవనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ యువత, విద్యార్థుల చదువుకు ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుందని రఘునాథ్ పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం ప్రత్యేక స్టడీ సెంటర్‌లా ఉండేలా అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, సర్పంచ్ మొరుపుటాల మానస-సంజీవ్, నాయకులు గోపతి రాజయ్య, దేగ బాపు, చుంచు లక్ష్మి నారాయణ, మోటపలుకుల తిరుపతి, పత్తిపాక సంతోష్, నాగసముద్రం సర్పంచ్ నందుర్క సుగుణ, బత్తుల శేఖర్, దంకా లక్ష్మణ్, దుమ్మని సత్తయ్య, ముత్తినేని మల్లేష్, కస్తూరి నాగరాజు, అమిరిశెట్టి రాజ్ కుమార్, గడ్డం స్వామి రెడ్డి, వీరమల్ల హరి గోపాల్, నాగిరెడ్డి హేమంత్ రెడ్డి, పచ్చ స్వప్న రాణి, ఆడే ప్రేమ్ సింగ్, ఏతం శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలే తగిన గుణపాఠం చెపుతారు

**కరీంనగర్‌లో బీఆర్ఎస్ 'వంటా వార్పు' నిరసన..**

**మాజీ మంత్రి గంగుల కమలాకర్ ధ్వజం**

**కరీంనగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం 'వంటా వార్పు' నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు మహిళల పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**గోదావరిఖని :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను

# సరండిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**భక్తిశ్రద్ధలతో పూజలు.. భజనలు, భక్తి పాటలతో మార్మోగిన హనుమాన్ మందిరం**

**రాత్రి జాగరణతో ఆధ్యాత్మిక సందడి.. ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ**

**విజేతలకు సర్పంచ్ మోహర్లే బాపూజీ బహుమతుల ప్రదానం**



**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ పరిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీకృష్ణుడిని భక్తితో కొలిచారు. పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలను ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. జన్మాష్టమిని పురస్కరించుకుని ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం వేళ గ్రామంలోని మహిళలు, యువత, చిన్నారులు, పెద్దలు ఆలయానికి చేరుకుని భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భజనలు, భక్తి పాటలు, శ్రీకృష్ణ నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. రాత్రి వేళ నిర్వహించిన జాగరణ కార్యక్రమంలో కూడా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**చిన్నారుల ప్రత్యేక ఆకర్షణ**

జన్మాష్టమి సందర్భంగా చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో అలంకరించడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై వేడుకల్లో పాల్గొనడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారుల వేషధారణ, వారి ఉత్సాహం పండుగ వాతావరణాన్ని మరింత అందంగా మార్చింది. ఉట్టి కొట్టే కార్యక్రమంతో కేరింతలు వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఉట్టి కొట్టేందుకు యువత, చిన్నారులు ఉత్సాహంగా ముందుకు రావడంతో అక్కడ సందడి నెలకొంది. ఉట్టి కొట్టే సమయంలో గ్రామస్థులు కేరింతలు కొడుతూ పాల్గొన్న వారికి ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు చిన్నారులు, మహిళలు, యువతతో పాటు పెద్దలు కూడా పెద్ద సంఖ్యలో చేరడంతో ఆలయ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

**సర్పంచ్ బాపూజీ మాట్లాడుతూ..**

ఈ సందర్భంగా సరండి గ్రామపంచాయతీ సర్పంచ్ మోహర్లే బాపూజీ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. గ్రామస్థులంతా కలిసికట్టుగా పండుగను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గ్రామంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే మన పండుగలు, సంప్రదాయాల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందని సర్పంచ్ బాపూజీ అన్నారు. శ్రీకృష్ణుడి జీవితంలోని ధర్మం, నీతి, సత్యం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజల సహకారంతో జన్మాష్టమి వేడుకలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేత ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న వారికి ప్రోత్సాహకంగా సర్పంచ్ బాపూజీ బహుమతులు అందజేశారు. విజేతలను అభినందించి, కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, యువతను ప్రోత్సహించారు. బహుమతులు అందుకోవడంతో విజేతల్లో ఆనందం నెలకొంది. రాత్రి పొద్దుపోయే వరకు భజనలు, భక్తి పాటలు, జాగరణ కార్యక్రమాలు కొనసాగడంతో సరండి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామస్థులు కుటుంబ సమేతంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. హనుమాన్ మందిరం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. గ్రామస్థుల ఐక్యత, భక్తి, సంప్రదాయాల కలయికగా సాగిన సరండి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. పండుగ సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కార్యక్రమాలు ప్రశాంతంగా కొనసాగాయి. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలు గ్రామస్థులలో ఆనందాన్ని నింపాయి.జర్నలిస్ట్ సూరి!.

# ఉపాధ్యాయుల చేతిలోనే దేశ భవిష్యత్తు



**దండేపల్లి, సెప్టెంబర్ 04(ప్రజాజ్యోతి ):**దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని, ఆ దిశగా ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండు రామన్న, జోనల్ చైర్‌పర్సన్ మల్లికార్జున్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ద్వారక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీరటి సురేష్‌తో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు అన్నం సత్యనారాయణ, జాబు సుగుణాకర్, వసర్తి సత్తయ్య, రాస శేఖర్, అలిశెట్టి లక్ష్మణ్‌లను పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి పోలంపల్లి రామరాజు, డిస్ట్రిక్ట్ ఉపాధ్యక్షులు బొలిశెట్టి రాజన్న, గడ్డం రామచందర్ తదితరులు పాల్గొన్నారు